మా అక్షరాలు - నిజాల నిప్పు కణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 17 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada

మంగళవారం 19 మార్చి 2024

## నారీ శక్తిని తక్కువ అంచనా వేయవద్దు

# ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి

దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి మళ్ళీ బిజేపి కి ఓటేయండి

తెలంగాణను దోచుకున్న వారిని ఎవ్వరినీ వదిలిపెట్టం

కాంగ్రెస్ కూటమి అవినీతిమయం - అవినీతి పై కాంగ్రెస్ - బి ఆర్ ఎస్ ఒక్కటయ్యారు

బి ఆర్ ఎస్ అవినీతిపై నోరు మెదపని కాంగ్రెస్ - తెలంగాణ అభివృద్ధికి ఎంతో చేశాను

గీతా విద్యాలయంలో గ్రౌండ్ లో బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ..



జగిత్యాల మార్చ్ 18 (ప్రజా మంటలు ప్రత్యేక ప్రతినిధి) : దేశంలో మహిళా శక్తిని గుర్తించలేకపోవడమే కాకుండా, నిన్నటి ముంబాయి సభలో అవహేళన గా మాట్లాడిన రాహుల్ గాంధీ, నాకు మహిళా శక్తిని గుర్తు చేశారు. శక్తి అంటే, మహిళలే. ఇక్కడి మహిళలు అందరూ శక్తి స్వరూపిణి లే. మన చరిత్ర అంతా శక్తి మాయమే. దీన్ని గుర్తించలేని రాహుల్ ఎన్నడూ దేశానికి నాయకుడు కాలేడు. వారసత్వ రాజకీయాలతో కుళ్లిపోయిన కాంగ్రెస్ తో జత కట్టేవారంతా మిగతా 2లో..





## తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామా

హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల వేళ మరోసారి ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తమిళిసై ప్రత్యక్ష మిగతా 2లో..



# ఢిల్లీలో సీఎం రేవంత్..

నేడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం

హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): నేడు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఆదివారం రాహుల్ న్యాయ్ యాత్ర ముగింపు సభలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. అటు నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సీడబ్ల్యూసీ, సీఈసీ మీటింగ్ లో పాల్గొననున్నారు. కాగా.. ఈ సమావేశంలో లోక్ సభ అభ్యర్థుల ఎంపిక.. తదుపరి అంశాలపై చర్చించనుంది. ఇప్పటికే తెలంగాణ నుంచి తొలి జాబితాలో కాంగ్రెస్ నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 13 మంది అభ్యర్థుల ఎంపికపై చర్చించనుంది. అయితే.. రేపటి సీఈసీ సమావేశంలో అభ్యర్థులను ఫైనల్ చేయనున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆమోదించనున్నారు. అలాగే.. ఎన్నికల ప్రచారం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ హైకమాండ్ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.



# లిక్కర్ స్కామ్‌లో కవితే కీలక సూత్రధారి

ఆప్‌కు వందకోట్లు చేర్చడంలో కీలక పాత్ర

కేసులో దేశవ్యాప్తంగా 15మంది అరెస్ట్

మొత్తం రూ.128.79 కోట్లు సీజ్ చేశాం

దర్యాప్తు సంస్థ ఇడి సంచలన వివరాలు వెల్లడి

న్యూఢిల్లీ,మార్చి18 (ప్రజా మంటలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యక్తి అని తేలింది. దర్యాప్తు సంస్థ ఇదే విషయాన్ని ప్రకటించింది. కవిత అరెస్టుపై దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు పేర్కొంది. ఢిల్లీ, హైదరాబాద్ ,చెన్నై, ముంబైతో పాటు పలు ప్రాంతాలో సోదాలు నిర్వహించామని వెల్లడించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటివరకు 15 మందిని అరెస్ట్ చేశామని, మొత్తం రూ.128.79 కోట్లు సీజ్ చేశామని వెల్లడించింది. మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తో పాటు పలువురు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారని వివరించింది. ఈ నెల 23 వరకు కవితకు న్యాయస్థానం రిమాండ్ విధించిందని ఈడీ పేర్కొంది. కవిత ఇంట్లో ఈ నెల 15న సోదాలు నిర్వహించామని, ఆ సమయంలో కవిత బంధువులు ఆటంకం కలిగించాని ప్రకటనలో తెలిపింది. ఆప్ లీడర్లతో కలిసి కవిత అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని ఈడీ ప్రకటించింది. రూ.100 కోట్ల మొత్తాన్ని ఆప్ నాయకులకు చేర్చడంలో కవిత కీలక పాత్ర పోషించారని వెల్లడించింది. మిగతా 2లో..

### కవితపై ఇడి ప్రశ్నల వర్షం
### ములాఖత్‌లో కలిసిన కెటిఆర్,హరీష్



2లో..

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, మార్చి 18 (ప్రజా మంటలు): హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా కూల్ అయ్యింది. ఆకాశం మేఘావృతమైనది.. పలు ప్రాంతాల్లో వర్షం వాన పడుతుంది. నిన్నటి ( ఆదివారం) వరకు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా, తాజాగా హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో వర్షం పడటంతో.. ప్రజలు రిలాక్స్ అవుతున్నారు. కొండపూర్, మియాపూర్, చందానగర్, ఆర్సీపూరం, బీరంగూడ పరిసర ప్రాంతాల్లో వర్షం మిగతా 2లో..



## జైలు నుంచి పార్లమెంటుకు తీసుకెళ్లండి

సంజయ్ సింగ్ ప్రమాణ స్వీకారంపై

ఢిల్లీ కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ,మార్చి18 (ప్రజా మంటలు): ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో నిందితుడైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు సంజయ్ సింగ్ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మంగళవారం పార్లమెంటుకు హాజర య్యేందుకు ఢిల్లీ కోర్టు అనుమతి మంజూరు చేసింది. సంజయ్ సింగ్ ఇటీవలే రెండవసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు, కానీ ప్రమాణ స్వీకారానికి సమన్లను తిరస్కరించారు. ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ కోర్టు సంజయ్ సింగ్‌ను తగిన భద్రతతో పార్లమెంటుకు తీసుకెళ్లేలా మిగతా 2లో..

## మరోసారి ఈడీ ఎదుట కేజ్రీవాల్ గైర్హాజరు



న్యూఢిల్లీ,మార్చి18 (ప్రజా మంటలు): ఢిల్లీ వాటర్ బోర్డుకు సంబంధించిన మనీలాం డరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీ విచారణ కు హాజరు కావడం లేదు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇది మాత్రమే మిగతా 2లో..

## గాజాలోని అల్-షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ మిలిటరీ ఆపరేషన్

మిలిటెంట్లను ఎదుర్కోవడమే లక్ష్యమన్న ఇజ్రాయెల్

గాజ, మార్చి18 (ప్రజా మంటలు): ఇజ్రాయెల్‌పై దాడులను చేసేందుకు హమాస్ మిలిటెంట్లు గాజాలోని అల్-షిఫా ఆసుపత్రి ప్రాంతాల్లో ఉన్నారనే ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు.. ఇజ్రాయెల్ సైన్యం హమాస్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఇంటెలిజెన్స్ పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్‌ను చేపట్టామని, పౌరులకు హాని చేయడం కంటే హమాస్ మిలిటెంట్లను ఎదుర్కోవడమే లక్ష్యమని మిగతా 2లో..



## ఆఫ్ఘనిస్తాన్‌పై పాక్ వైమానిక దాడులు

8 మంది మృతి, పలువురికి గాయాలు



2లో..

# అంతరిక్షంలో భారత్ స్పేస్‌స్టేషన్


స్పేస్ స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం

కీలక నిర్ణయం దిశగా ఇస్రో




2లో..

## ప్రజా నాడి




# బిఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కండువా కప్పి ఆహ్వానించిన గులాబీ బాస్

ఎవరెన్ని విమర్శలు చేసినా..తనదారి రహదారి

మీడియాతో ఆర్ఎస్పీ వెల్లడి

హైదరాబాద్,మార్చి18 (ప్రజా మంటలు): ఎట్టకేలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ కు గులాబీ కండువా కప్పిన కెసిఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ లో పలువురు నేతలు చేరారు. ఈ మేరకు తెలంగాణ భవన్ నుంచి నేరుగా గజ్వేల్‌లోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కు భారీ ర్యాలీగా చేరుకున్నారు. గజ్వేల్ లోని ఎర్రవెల్లి కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ లో జాయిన్ అయ్యారు. తెలంగాణ భవన్‌కు వెళ్లేముందు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. . తన రాజకీయ భవితవ్యంపై వందలాది మంది అభిమానులు, శ్రేయోభిలాషులతో మేధోమథనం జరిపిన తర్వాత.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఏ నిర్ణయం తీసుకున్నా తన వెంటే నడుస్తానని మాట ఇచ్చిన అందరికీ ధన్యవాదాలని తెలిపారు. తెలంగాణ విశాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని, దేశంలో లౌకికత్వం, రాజ్యాంగ రక్షణ, బహుజనుల అభ్యున్నతి కోసం ఇవాళ కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరానన్నారు. ప్రజల కలలను నిజం చేసే దిశగా పయనిస్తున్నట్లు ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. తెలంగాణలో ఎంపీ ఎలక్షన్లు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణకు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి పీఠాన్ని మిగతా 2లో..





## కూలిన నిర్మాణంలో ఉన్న భవనం

ఏడురురుగు వ్యక్తుల దుర్మరణం

కోల్‌కత,మార్చి18(ప్రజా మంటలు): కోల్‌కతా గార్డెన్ రీచ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనం కూలి ఇద్దరు మహిళలతో సహా కనీసం ఏడుగురు వ్యక్తులు మరణించారు. ఘటనలో అనేక మంది గాయపడినట్లు పోలీసులు సోమవారం వెల్లడించారు. భవనం కూలిన 16 గంటల తరువాత శిథిలాల కింద కనీసం నలుగురు చిక్కుకుపోయినట్లు గుర్తించడంతోను, వారిలో ఒకరే ప్రాణంతో ఉన్న సూచనలు కనిపించడంతోను మృతుల సంఖ్య పెరగవచ్చునని రక్షణ, సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్న అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు సూచించారు. భవన నిర్మాణం అక్రమంగా జరుగుతున్న ఆ ప్రదేశంలో యుద్ధ ప్రాతిపదికన రక్షణ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ తెలిపారు. భవనం ప్రమోటర్ మహమ్మద్ వసీమ్‌ను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# నారీ శక్తిని తక్కువ అంచనా వేయవద్దు - ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి







వారసత్వ రాజకీయాలను జప్రవత్సహించే వారని ప్రధాని మోడి జగిత్యాల ఎన్నికల సభలో మంది పడ్డారు. నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో భాగమైన జగిత్యాలలో జరిగిన విజయ సంకల్ప బహిరంగ సభకు మోడీ హాజరయ్యారు.

"నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు",అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీజగిత్యాలలో తనకు ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపంలో కన్పిస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల పండగ మొదలైందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య ఉత్సవానికి తొలి అడుగుపడిందన్నారు.. తెలంగాణలో బీజేపీకి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.నిన్నటి దాకా బి ఆర్ ఎస్ అవినీతిపై విరుచుకపడ్డ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత, బి ఆర్ ఎస్ తో జత కట్టి, అవినీతిలో భాగం పంచుకోంటుందని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని అంటూ వికాసం కోసం తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు.కాళేశ్వరంలో అవినీతి-లిక్కర్ స్కామ్ లో కవిత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భారీ అవినీతికి పాల్పడిందంటూ, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కెసిఆర్ కుమార్తె కవిత కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్ లో ఆమెకు భాగస్వామ్యం ఉందని, అవినీతికి ఎవరు పాల్పడినా సహించబోనని, ఎంతటి పెద్దవారైన జైలుకు పంపుతానని తేల్చి చెప్పారు.. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కొత్తగా ఇక్కడ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ దోచి ఢిల్లీ పార్టీ కి పంపుతుందని ధ్వజమెత్తారు.. తెలంగాణలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ రెండు ఒక్కటే అన్నారు.

జూన్ 4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందన్నారు. రాహుల్‌గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు.

సర్వాంతర్యామి శక్తి- అజేయమైన శక్తి ప్రతిరూపాలు మీరే -మోడి

శక్తిని ఎవరైనా నాశనం చేయగలరా, శక్తిని వినాశనం చేస్తానని ఎవరైనా అంటారా అని మోదీ ప్రశ్నించారు.శక్తి వినాశనం చేసేవాళ్లకు.. శక్తి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరుగుతుందని పేర్కొన్నారు. శక్తి రూపంలో మహిళలు తనను ఆశీర్వదించేందుకు వచ్చారని, ఇది తన భాగ్యమని తెలిపారు. శక్తి స్వరూపులైన ప్రతి మాత, సోదరి, కుమార్తెలకు తాను పూజారినని చెప్పారు.శక్తి స్వరూపులైన మహిళల రక్షణ కోసం తాను ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను భారతమాత పూజారినని పేర్కొన్నారు., చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతాన్ని కూడ శివశక్తి అని పేరు పెట్టుకున్న విషయాన్ని మోడీ గుర్తు చేశారు. శక్తిని నాశనం చేసేవారికి, శక్తిని పూజించేవారికి మధ్య పోరాటం సాగుతుందన్నారు.

మోడిని ద్వేషించడం తిట్టడమే ప్రతిపక్షాల లక్ష్యం

ఈ రెండు పార్టీలు తనను దూశించడమే ధ్యేయంగా పెట్టుకున్నాయని మోడీ అన్నారు. తెలంగాణను దోచుకున్నవారిని ఎవరినీ వదలం అంటూ మోడీ ఘాటుగా ప్రతిస్పందించారు. పోలింగ్ రోజు దగ్గరపడుతున్న కొద్దీ తెలంగాణలో బీజేపీ ప్రభంజనం కనిపిస్తోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రక్షాళన అవుతాయని, ఈ రెండు పార్టీలు పూర్తిగా ఖాళీ అవుతాయని వ్యాఖ్యానించారు.

పొరుగున ఉన్న కరీంనగర్ లోక్ సభ నియోజకవర్గంపై కూడా ప్రభావం చూపుతుందని, ప్రస్తుతం కరీంనగర్, నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గాలు బీజేపీ ఖాతాలో ఉన్నాయని, పెద్దపల్లి, అదిలాబాద్ లతో సహాయ 17 సీట్లను గెలిపించాలని ప్రధానాయి మోడి ప్రజలను కోరారు.

సభలో మొదటగా పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంతి జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో రైల్వేల, రోడ్ల అభివృద్ధికి, ఎంతో కృషి చేశామని, ఈసారి తప్పక బిజేపిని గెలిపించాలని కోరారు. సభలో ఎంపీలు అరవీందహ ధారమపూరి, బండి సంజయ్ లతో పాటు పెద్దపల్లి అభ్యర్థి ఎం శ్రీనివాస్ లను సభకు పరిచయం చేస్తూ, గెలిపించాలని ప్రధాని కోరారు. ఇంకా జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, బిజేపి నాయకురాలు, రాష్ట కార్యవర్గ సభ్యురాలు బొగ శ్రావణి, మాజీ ఎమ్మెల్యేలు సుద్దాల దేవయ్య, బొడిగా శోభ, మూడు నియోజకవర్గాలనాయకులు పాల్గొన్నారు.

## ఆఫ్ఘనిస్తాన్‌పై పాక్ వైమానిక దాడులు

### 8 మంది మృతి, పలువురికి గాయాలు

ఖోస్ట్,మార్చి18 (ప్రజా మంటలు):

పొరుగు దేశంపై పాకిస్థాన్ ప్రతీకార చర్యలకు పూనుకుంది. ఇటీవల జరిగిన ఆత్మాహుతి దాడికి పాకిస్థాన్ ప్రతీకారం తీర్చుకొంది. ఆఫ్ఘనిస్తాన్‌లో రెండు ప్రాంతాలపై వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు పిల్లలు సహా ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఆఫ్ఘనిస్తాన్ ముష్కరులకు ఆశ్రయం కల్పిస్తుందన్న సాకుతో పాకిస్థాన్ వైమానికి దాడులకు తెగబడింది. రెండు ప్రాంతాల్లో దాడులు చేసింది. ఈ రెండు దాడుల్లో ముగ్గురు పిల్లలు సహా ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఈ చర్యను ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధి ఖండించారు. ఈ చర్య తమ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించిందని పేర్కొన్నారు. పాకిస్థాన్ స్వదేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయలేక మమ్మల్ని నిందించడం తగదని తెలిపింది. అక్కడి ప్రభుత్వంలోనే అసమర్థత నెలకొందని.. ఇలాంటి చర్యలకు తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆఫ్ఘనిస్తాన్ హెచ్చరించింది. ఈ విషయంలో ఇస్లామిక్ ఎమరేట్ ఆఫ్ అఫ్ఘనిస్తాన్ సార్వభౌమత్వం ఏమాత్రం రాజీ పడదని పేర్కొంది. తూర్పు ప్రావిన్స్‌లోని ఖోస్ట్, పాక్టికలో సోమవారం పాకిస్థాన్ విమానాలు దాడులు నిర్వహించింది. ఇప్పటికే పాక్-ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ దాడులు జరగడం మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోసినట్లుగా కనిపిస్తోంది. పాకిస్థాన్‌లోని ఖైబర్ ప్రాంతంలో రెండ్రోజుల క్రితం భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భద్రతా సిబ్బంది మరణించారు. వీరి అంత్యక్రియల సందర్భంగా పాక్ అధ్యక్షుడు జర్దారీ స్పందిస్తూ కచ్చితంగా తమ వీరుల త్యాగాలు వృథాగా పోవని ప్రతిజ్ఞ చేశారు. టీటీపీ ఉగ్రవాదులే ఈ దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ సంస్థను ఆఫ్ఘనిస్థాన్ భూభాగం కేంద్రంగా నడిపిస్తున్నారు. మొత్తానికి సోమవారం పాక్ ప్రతీకార చర్యలకు పూనుకుంది.ఇటీవల పాక్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. నవాజ్ షరీఫ్-భుట్టో పార్టీల కూటమితో ప్రభుత్వం ఏర్పడింది. జర్దారీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## కూలిన నిర్మాణంలో ఉన్న భవనం

అరెస్టు చేసినట్లు, చట్టం ప్రకారం కఠిన చర్య తీసుకోనున్నట్లు మేయర్ చెప్పారు. నగర పశ్చిమ పరిధిలోని అజాన్ మొల్లా లేన్‌లోని భవనం కూలిన ప్రదేశాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సందర్శించారు. అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోగలమని స్థానికులకు మమత హామీ ఇచ్చారు. భయంకరమైన ప్రమాదంలో నిర్మాణంలోని ఐదు అంతస్తుల భవనం ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో కూలిందని మేయర్ హకీమ్ తెలియజేశారు. 'శిథిలాలలను తొలగించి, బాధితులను చేరుకునేందుకు మేము గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాలు వాడుతున్నాం. బాధితుల వద్దకు మేము చాలా జాగ్రత్తగా వెళుతున్నందున ఎక్కువ సమయం పడుతోంది' అని అగ్నిమాపక శాఖ అధికారి వివరించారు. శిథిలాలు భారీగా పేరుకుపోయినందున చిక్కుకుపోయినవారి వద్దకు చేరుకోవడం రక్షణ, సహాయక సిబ్బందికి కష్టం అవుతోందని ఆయన తెలిపారు.

### లిక్కర్ స్కామ్‌లో కవితే కీలక సూత్రధారి

ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో ఆప్ అగ్రనేతలైన అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాలతో కలిసి ఎంఎల్సీ కవిత కుట్ర పన్నినట్టు దర్యాప్తులో వెల్లడైందని వివరించింది. అనుమతుల కోసం ఆప్ నేతలకు ఆమె రూ.100 కోట్లు చేరవేశారు. అవినీతి, కుట్రల ద్వారా చిన్న వ్యాపారుల నుంచి డబ్బుని సేకరించి ఆప్ నేతలకు చేరవేశారని అని ఈడీ వివరించింది. ఈ కేసులో ఇప్పటివరకు 1 ప్రాసిక్యూషన్ ఫిర్యాదు, 5 అనుబంధ ఫిర్యాదులను దాఖలు చేశామని ఈడీ వివరించింది. 24 జనవరి 2023 నుంచి 3 జులై 2023 మధ్యకాలంలో రూ.128.79 కోట్లను తాత్కాలికంగా అటాచ్ చేశామని వెల్లడించింది. ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతోందని ఈడీ వెల్లడించింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో మార్చి 15న కవిత ఇంట్లో ఈడీ, ఐటీ అధికారులు సోదాలు చేసి, కవితను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈడీ అధికారులు ఏడు రోజుల రిమాండ్ లో ఉన్న కవితను విచారణ చేస్తున్నారు. కవిత నివాసంలో రైడ్ జరుగుతున్న సమయంలో ఆమె బంధువులు, సన్నిహితులు ఆటకం కలిగించారని ఈడీ అధికారులు అన్నారు. కవిత ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులతో కలిసి లిక్కర్ పాలసీ అమలు, రూపకల్పనలో అవినీతికి పాల్పడ్డారని వివరించారు.

## కవితపై ఇడి ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ,మార్చి18 (ప్రజా మంటలు):

లిక్కర్ స్కాం కేసులో రిమాండ్ లో ఉన్న కవిత తొలిసారిగా ఈడీ విచారణ ఎదుర్కొంది. కవితపై ఈడీ ప్రశ్నల వర్షం కురిపించింది. కవిత వాటిలో కొన్నింటికి సమాధానాలు చెప్పగా.. మరి కొన్ని ప్రశ్నలకు మౌనం వహించింది. ఆమ్ అద్మీ పార్టీకి ఇచ్చిన వంద కోట్లు ఏలా వచ్చాయని, లిక్కర్ పాలసీ ద్వారా సంపాధించిన రూ.192 కోట్ల గురించి ఆధారాలు చూపించాలని అధికారులు ఆమెను ప్రశ్నించారు. ఇంకా ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారని ఈడీ ఆఫీసర్స్ ఆరాతీశారు. విచారణను ఈడీ అధికారులు వీడియో రికార్డ్ చేశారు. విచారణ అనంతరం కేటీఆర్, హరీష్ రావు ములాఖత్ తీసుకొని ఈడీ ఆఫీస్ లో కవితను కలిశారు. వారితోపాటు కవిత లాయర్ మోహిత్ రావు కూడా ఉన్నారు. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగా ఈడీ కవితను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ ఆమె భర్త అనిల్ రేపు సుప్రీం కోర్టులో కంటెప్ట్ పిటిషన్ దాఖలు చేయనున్నారు.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

కురిసింది. ఇక, హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఇవాళ పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలు దంచి కొట్టాయి.. ఇక, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. నాంపల్లి, లక్డికాపూల్, ఖైరతాబాద్, మొజంజాహి మార్కెట్, కొండపూర్, చందానగర్, మియాపూర్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురిసింది. మరోవైపు తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆదివారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వానలు కురిశాయి. మరో నాలుగు రోజులు రాష్ట్రంలో వడగండ్ల వానలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇప్పటికే నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగండ్ల వర్షాలతో పాటు, ఉరుములు, మెరుపులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది.వర్షాల హెచ్చరికల నేపథ్యంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావారణశాఖ. మంచిర్యాల, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, జోగులాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బుధ, గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది.ఆదివారం ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసినట్లు తెలిపింది. అత్యధికంగా సంగారెడ్డి జిల్లా నాగలగిద్దలో 3.4 సెంటీమీటర్ల వర్షం కురవగా.. కంగ్టిలో 2.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వడగండ్ల వానలతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. నిజామాబాద్ జిల్లాలో కురిసిన వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి.

## మరోసారి ఈడీ ఎదుట కేజ్రీవాల్ గైర్హాజరు

కాదు, మీరు ఈడీ సమన్లు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. లంచం తీసుకున్నట్లు ఆప్‌పై ఆరోపణలు రావడం ఇది రెండో కేసు. దీనికి ముందు ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా ఈడీ విచారించాలని కోరుతోంది. ఎక్సైజ్ పాలసీ 2021-22 ద్వారా సంపాదించిన డబ్బును గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగించినట్లు ఈడీ పేర్కొంది. ఢిల్లీ జల్ బోర్డులో అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదివారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. అరవింద్ కేజ్రీవాల్‌ను ఈరోజు హాజరుకావాలని ఈడీ కార్యాలయానికి పిలిచారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం కేజ్రీవాల్‌ను ప్రచారం చేయకుండా ఆపేందుకు 'బ్యాకప్' ప్లాన్ అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పేర్కొంది. అరవింద్ కేజ్రీవాల్ (55) ఈరోజు అంటే సోమవారం ఏపీజే అబ్దుల్ కలాం రోడ్‌లోని ఈడీ ఆఫీసులో అధికారుల ముందు హాజరు కావాలని.. మనీలాండరింగ్ నిరోధక చట్టంనిబంధనల ప్రకారం అతని స్టేట్‌మెంట్‌ను నమోదు చేయాలని కోరారు. అయితే ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ హాజరు కావడం లేదని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. మనీలాండరింగ్ చట్టం కింద నమోదైన రెండో కేసు ఇది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అంటే అరవింద్ కేజ్రీవాల్‌ను పిలిపించడం జరిగింది. గతంలో ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అతడిని ప్రశ్నించేందుకు సమన్లు జారీ చేశారు. ఎనిమిది సమన్లు చట్టవిరుద్ధమని పేర్కొంటూ అరవింద్ కేజ్రీవాల్ ఈ కేసులో ఇంకా ఏజెన్సీ ముందు హాజరుకాలేదు. ఢిల్లీ జల్ బోర్డ్ కేసును కలుపుకుంటే, ఇప్పటి వరకు అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ 9 సమన్లు పంపింది.ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు తొమ్మిదో సమన్లు జారీ చేయబడ్డాయి. మార్చి 21 న విచారణకు పిలిచారు. డీజేబీ కేసులో ఢిల్లీ ప్రభుత్వ శాఖ ఇచ్చిన కాంట్రాక్టులలో అవినీతి ద్వారా పొందిన డబ్బును ఢిల్లీ అధికార పార్టీ '%ూూ్రా%'కి ఎన్నికల నిధులుగా పంపినట్లు ఈడీ పేర్కొంది. సాంకేతిక అర్హత ప్రమాణాలకు అనుగుణంగా లేనప్పటికీ, ఎన్‌కెజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీకి డిజెబి ఇచ్చిన రూ. 38 కోట్ల కాంట్రాక్ట్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి కేసు నమోదు చేసింది. జనవరి 31న ఈ కేసులో అరెస్టయిన వారిలో డిజెబి మాజీ చీఫ్ ఇంజనీర్ జగదీష్ కుమార్ అరోరా, కాంట్రాక్టర్ అనిల్ కుమార్ అగర్వాల్ ఉన్నారు. 'నకిలీ' పత్రాలను సమర్పించి ఎన్‌కెజి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కాంట్రాక్టును పొందిందని, కంపెనీ సాంకేతిక అర్హతను అందుకోలేదన్న విషయం అరోరాకు తెలుసని ఇడి పేర్కొంది.

## బిఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

అందించిన కారు జోరుకు గతేడాది జరిగిన ఎన్నికల్లో హస్తం బ్రేకులు వేసింది. అప్పటి నుంచి బీఆర్ఎస్ పరిస్థితి మరింత కష్టతరంగా మారింది. సీనియర్ నేతలు పార్టీ మారడం, పార్టీ మారతారన్న ఊహాగానాల మధ్య నేడు కీలక ఘట్టం నెలకొంది. బీఎస్పీకి రాజీనామాచేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లోకి చేరారు. పరిస్థితులకు అనుగుణంగా కొత్త దారిని వెతుక్కోవాల్సి వచ్చిందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున నాగర్ కర్నూల్ నుంచి ప్రవీణ్ పోటీ చేయనున్నారు. తెలంగాణలో తన నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా బీఎస్పీ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా ముందుకు సాగాల్సిందేనని ఇదే తాను నమ్మిన ధర్మం అని అన్నారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన పార్టీ అధ్యక్షురాలు మాయావతికి ధన్యవాదాలు తెలిపారు. బహుజనుల అభివృద్ధి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

### తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజీనామా

రాజకీయాల్లోకి రానున్నట్టు తెలుస్తోంది.తెలంగాణ రాజ్‌భవన్ అధికారిక ప్రకటన ప్రకారం.. తమిళిసై సౌందరరాజన్ తెలంగాణ గవర్నర్ పదవికి, అలాగే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. అనంతరం, రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆమె చెన్నైకి వెళ్తారని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.కాగా, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళిసై తమిళనాడు పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేయనున్నారు. తమిళనాడులోని తుత్తుకూడి, చెన్నై సెంట్రల్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాజకీయపరంగా తమిళిసై కుటుంబానికి కాంగ్రెస్ నేపథ్యం ఉంది. అయితే తర్వాతి కాలంలో బీజేపీ వైపు ఆమె మొగ్గు చూపించారు.

## అంతరిక్షంలో భారత్ స్పేస్‌స్టేషన్

### స్పేస్ స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం

### కీలక నిర్ణయం దిశగా ఇస్రో

నెల్లూరు,మార్చి18 (ప్రజా మంటలు):

ఇస్రో ఈ పేరు తెలియని భారతీయుడు బహుశా ఉండడేమో.. ఒక్క భారతీయుడు ఏంటి ప్రపంచ దేశాల్లో ఇప్పుడు అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రో అంటే ఒక బ్రాండ్. చంద్రయాన్ సక్సెస్‌తో ప్రపంచ దేశాలు ఒక్కసారిగా భారత్ వైపు చూసేలా చేశారు భారత శాస్త్ర వేత్తలు.అదే విజయం కొనసాగించేందుకు పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళ్తూ సక్సెస్ రేట్‌లో ప్రపంచ దేశాల్లో మొదటి స్థానంకి వచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 2047 నాటికి అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు ఇస్రో శాస్త్ర వేత్తలు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో 2047వ సంవత్సరం నాటికి అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ నిర్మించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తోంది. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా శ్రీవారి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లో నూతనంగా మూడవ లాంచ్ పాడ్ నిర్మించండానికి స్థల సేకరణ ఏర్పాట్లలో ఇస్రో ఇప్పటికే నిమగ్నమైంది. దీంతో పాటుగా సరికొత్త రాకెట్ లాంచింగ్ వెహికల్ న్యూ జనరేషన్ రాకెట్ లాంచింగ్ వెహికల్ ఎన్‌జీఆర్ఎల్వి 2035 నాటికి సిద్ధమయ్యే విధంగా ఇస్రోకు కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టింది.అందులో భాగంగానే 2028 న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ మొదటి టెస్ట్ వెహికల్‌ను తాత్కాలిక ప్రయోగంగా ప్రయోగించనున్నారు. 2035 %--% 47 సంవత్సరం నాటికి ఎన్‌జీఆర్ఎల్వి లాంచ్ వెహికల్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఇస్రోకి అంకితం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు ఇక్కడి శాస్త్రవేత్తలు. అయితే ఇస్రోకు ఈ ఎన్‌జీఆర్ఎల్వి న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ఒక వరంగా మారనుంది. ఈ న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ డిసైన్ తయారు చేసే దానిపై ఇస్రోలో పనిచేస్తున్న పిఎస్ఎల్వీ, జిఎస్ఎల్వి, ఎల్ఎంవీ-3 రాకెట్ వెహికల్స్‌లో నైపుణ్యం కలిగిన పదిమంది శాస్త్ర వేత్తలను న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివకుమార్ కు సహాయ సహకారాలు అందించనున్నారు. ఈ న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ కనుక ఇస్రోకు సిద్ధమైతే సుమారు 10 టన్నుల బరువు కలిగినటువంటి ఉపగ్రహాలను సైతం (జిటిఓ) %+ూ% జియో ట్రాన్స్ఫర్ ఆర్బిట్ కక్షలోకి సునాయాసనంగా ఉపగ్రహాలను సైతం ప్రవేశపెట్టగలిగే సత్తా ఇస్రోకి సొంతం కానుంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో 1975 ఏప్రిల్ 19న ఆర్యభట్ట అనే సాటిలైట్?తో ప్రస్థానం మొదలుపెట్టి నేటికి వందల కొద్ది ఉపగ్రహాలను నింగికి పంపి ప్రపంచ దేశాల దేశాలకు దీటుగా నిలబడింది. అందులో ప్రధానమైన ఉపగ్రహాలు అంగారక, సూర్య, చంద్ర గ్రహాలపైకి ఉపగ్రహాలను పంపి అక్కడ ప్రయోగాలు చేపట్టి ప్రపంచ దేశాలకు ఇస్రో సత్తా చాటింది. సూర్య గ్రహంపైకి ఆదిత్య-%ా%1 ఉపగ్రహాన్ని పంపి చరిత్ర సృష్టించింది. అదేవిధంగా చంద్రయాన్ వన్, చంద్రయాన్ టు ఉపగ్రహాలతో చంద్రునిపై అడుగులు పెట్టి చంద్రునిపై పరిశోధనలు చేసి ప్రపంచ రికార్డును కైవసం చేసుకుంది. అంతే కాకుండా మంగళయాన్ పేరుతో అంగారక గ్రహంపై కూడా ఉపగ్రహాలను పంపి ఇస్రో తన సత్తా చాటుకుని ప్రపంచ దేశాలు సైతం ఇస్రో వైపు చూసేలా ప్రయోగాలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే 2047వ సంవత్సరాన్ని టార్గెట్?గా ఉంచుకొని ఇస్రో మరెన్నో దేశాభివృద్ధికి ఉపయోగపడే విధంగా రాకెట్ ప్రయోగాలకు సన్నాహాలు చేపడుతుంది. అందులో భాగంగానే అంతరిక్షంలో స్పేస్ స్టేషన్ ఏర్పాటు, న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ కొరకు శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణం చేపట్టడం వీటికి నిదర్శనం. ఇస్రో మొదటి సారి ఎస్ఎల్వి, ఏఎస్ఎల్వి, పీఎస్ఎల్వి, జీఎస్ఎల్వి రాకెట్ ప్రయోగాలు విజయవంతంగా చేపట్టి ఇప్పుడు జీఎస్ఎల్వి, ఎల్?విఎం 3 వాహక నౌక తో భారీ ఉపగ్రహాలను నింగిలోకి పంపుతుంది. అయితే వీటన్నింటికి భిన్నంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేసేలా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో భవిష్యత్ ప్రయోగాలు కొరకు ఎన్‌జీఆర్ఎల్వి న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్?కు ఇప్పుడు రూపకల్పన చేస్తోంది. ఈ రూపకల్పన 2035-2040 కల్లా పూర్తి చేసేలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ద్వారా ఇస్రో చంద్ర మండలంపైకి మానవులను సైతం పంపేందుకు అనువుగా ఉండే విధంగా ఎన్‌జీఎల్వికి రూపకల్పన చేస్తున్నారు.

## జైలు నుంచి పార్లమెంటుకు తీసుకెళ్లండి

### సంజయ్ సింగ్ ప్రమాణ స్వీకారంపై ఢిల్లీ కోర్టు ఆదేశం

చూడాలని, అతను తన ఫోన్‌ను ఉపయోగించకూడదని, ఇతర నిందితులతో మాట్లాడకూడదని తీహార్ జైలు అధికారులను ఆదేశించింది. సంజయ్ సింగ్‌కు చెందిన నార్త్ అవెన్యూ ఇంటిలో 10 గంటలపాటు సోదాలు జరిపిన తర్వాత, అక్టోబర్ 4, 2023న ఈడీ అధికారులు అరెస్టు చేశారు. మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ తర్వాత సంజయ్ సింగ్ ఈ కేసులో అరెస్టయిన మూడవ ఆప్ నాయకుడు. ఆ తర్వాత ఎక్సైజ్ కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడైన వ్యాపారవేత్త దినేష్ అరోరా సింగ్‌కు రూ.2 కోట్ల నగదు ఇచ్చారని ఈడీ ఆరోపించింది. కొంతమంది వ్యాపారవేత్తలకు అనుకూలంగా సిసోడియా ద్వారా మద్యం పాలసీలో మార్పులు చేసినట్లు సంజయ్ సింగ్ హామీ ఇచ్చారని కూడా ఆరోపించింది.

## గాజాలోని అల్-షిఫా ఆసుపత్రిలో ఇజ్రాయెల్ మిలిటరీ ఆపరేషన్

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ ప్రతినిధి ఒకరు సోమవారం తెల్లవారుజామున తెలిపారు."హమాస్‌కు చెందిన సీనియర్ ఉగ్రవాదులు అల్-షిఫా ఆసుపత్రిలో మళ్లీ గుమిగూడారని, ఇజ్రాయెల్‌పై దాడులకు ఆదేశిస్తున్నారని మాకు తెలుసు" అని డిఫెన్స్ ఫోర్సెస్ ప్రతినిధి హగారి చెప్పారు. పౌర ప్రాణనష్టాన్ని తగ్గించడానికి ఆపరేషన్ ఖచ్చితత్వంతో, జాగ్రత్తగా నిర్వహించబడుతుందని ఆయన చెప్పారు. రోగులు, వైద్య సిబ్బంది ఆస్పత్రిని ఖాళీ చేయాల్సిన అవసరం లేదని, వదిలి వెళ్లాలనుకున్నా ఒక మార్గం అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రి కాంపౌండ్‌లో రోగులకు సహాయం చేయడానికి అరబిక్ మాట్లాడేవారిని, వైద్య సిబ్బందిని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ నియమించిందని చెప్పారు. పౌరులకు మానవతా సహాయం అందిస్తోందని వెల్లడించారు. వైద్య సదుపాయాలను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించకూడదని చెబుతూ హమాస్ ఉగ్రవాదులు లొంగిపోవాలని పిలుపునిచ్చారు. "వైద్య సౌకర్యాలను టెర్రరిజం కోసం ఉపయోగించుకోకూడదు. హమాస్ తప్పనిసరిగా జవాబుదారీగా ఉండాలి" అని హగారి తన చిన్న వీడియో సందేశాన్ని ఇజ్రాయెల్ ఢిఫెన్స్ ఫోర్సెస్ ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా పోస్ట్ చేసారు.ఇంతలో గాజాలోని హమాస్-నియంత్రిత ఆరోగ్య మంత్రిత్వ శాఖ కొనసాగుతున్న ఇజ్రాయెల్ ఆపరేషన్‌పై ఒక ప్రకటన విడుదల చేసింది, "అల్-షిఫా మెడికల్ కాంప్లెక్స్‌లోని వైద్య సిబ్బంది, రోగులు, ఎక్కడి నుంచో వ్యక్తుల జీవితాలకు ఇజ్రాయెల్ బాధ్యత వహిస్తుంది" అని పేర్కొంది. ఈ దళాలు చేస్తున్న ఆక్రమణ.. అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించడమేనని ఈ ప్రకటనలో పేర్కొంది.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు



మెట్ పల్లి మార్చి 18 (ప్రజామంటలు):
కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నరసింగ రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. మండల కేంద్రమైన మల్లాపూర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని మొగిలిపేట, సంగెం, శ్రీరాంపూర్, కుస్తాపూర్, రత్నాపూర్ తదితర గ్రామాల నుండి సుమారు 150 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నరసింగ రావు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 6 గ్యారంటీలను అమలుచేయనున్నట్లు మేనిఫెస్టో ప్రకటించామని అందులో భాగంగా ఐదు గ్యారంటీలను 100 రోజుల్లోపే అమలు చేశామని త్వరలోనే మిగతా గ్యారంటీలను కూడా సంపూర్ణంగా అమలు చేస్తామని అన్నారు కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానానికి ఆకర్షితులై ఈరోజు పెద్ద ఎత్తున వివిధ పార్టీల నుంచి నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని వారందరినీ సాధరంగ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ లో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు కార్యకర్తలు కష్టించి పనిచేసి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని కోరుట్ల సెగ్మెంట్లో పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీఓట్లు వచ్చే విధంగా కష్టపడాల్సింది గా కోరారు మన కోరుట్ల సెగ్మెంట్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ తీసుకొచ్చిన పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కోరుట్ల నియోజకవర్గం కు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని జువ్వాడి నరసింగ రావు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే రైతులకు మేలు చేకూర్చడం ప్రారంభమైందని అందులో భాగంగానే పసుపు ధర పెరిగిందని రానున్న రోజుల్లో ప్రతి పంటకు మద్దత్తు ధరలు పెరుగుతయాని రైతుల కల్ల లో ఆనందం చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని కృష్ణారావు అన్నారు ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు మరి పెల్లిసత్తమ్మ మల్లయ్య గడ్డం శ్రీనివాస్ రెడ్డి గున్నాల శ్రీనివాస్ మామిడి మంజుల లక్ష్మారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుంద్ర శ్రీనివాసరెడ్డి మాజీ జడ్పిటిసి సభ్యులు ఎల్లల జలపతి రెడ్డి ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్లు మాజీ మండల పరిషత్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మొదటి రోజు ప్రశాంతంగా పది పరీక్షలు
### మండల విద్యాధికారి గంగుల నరేషం



కోరుట్ల మార్చ్ 18 (ప్రజామంటలు): మార్చ్ 18 నుండి మొదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా జరిగాయని కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేషం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.... పట్టణంలో రెగ్యులర్ విద్యార్థులు 1518 కాగా 1518 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారని ప్రైవేట్ లో 10 మంది విద్యార్థులు ఉండగా 02 పరీక్షకు హాజరు కాలేదని ఎనిమిది మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కేంద్రాల వారిగా పరీక్ష వ్రాసిన విద్యార్థులు గవర్నమెంట్ ఎచ్ ఎస్ 153, జడ్పీఎచ్ఎస్ బాయ్స్ 240, గర్ల్స్ ఎచ్ ఎస్ 250, కేరళ 199, గౌతమ్ మోడల్ 239, గౌతమ్ స్కూల్ 260, మల్లపూర్ ఎచ్ఎస్ 129, ఐలాపూర్ ఎచ్ఎస్ 48 మరియ ఎస్ఎఫ్ఎస్ (ప్రైవేట్) 10మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో కోరుట్ల పోలీస్ శాఖ మరియు హెల్త్, మున్సిపల్ శాఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## తల్లిదండ్రుల స్మారకంగా పంచాంగాల వితరణ



జగిత్యాల మార్చ్ 18 (ప్రజామంటలు):
ఆదిలాబాద్ పంచాంగ కర్త చికిలి వెంకటేశ్వర శర్మ చే రూపొందించబడి గుణించబడిన శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగములను శ్రీధర గోపాల రామయ్య అరవింద జ్ఞాపకార్థం వారి తనయులు పంచాంగములకు దాతగా వ్యవహరించి జగిత్యాల బ్రాహ్మణ సంఘ అధ్యక్షులతో కలిసి పురోహితులకు బ్రాహ్మణ బంధువులకు సోమవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర. గణపతి శర్మ మాట్లాడుతూ తమ మాతాపితల స్మారకంగా పంచాంగాల రూపకల్పనలో తన వంతు కొంత ఆర్థిక సహాయం అందించి బ్రాహ్మణోత్తములకు, పలువురు ప్రముఖులకు వితరణ చేసినట్లు తెలిపారు.



## బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించాలి
### ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి మార్చ్ 18 (ప్రజామంటలు):
ధర్మపురి క్షేత్రస్థ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, సిబ్బంది, అర్చకులు, ప్రత్యేకించి ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. సోమవారం శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల బ్రహ్మోత్సవాలకు సంబందించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. ముందుగా నంది చౌరస్తా నుండి దేవాలయం వరకు గల దారి, పార్కింగ్ స్థలం, కోనేరు బ్రాహ్మ పుష్కరిణీ వద్ద పరిస్థి తిని పరిశీ లించారు. త్రాగు నీటి సౌకర్యాలు, గోదావరి వద్ద భక్తుల స్నానాలకు సంబందించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళ వారం నుండి స్వచ్ఛంద సహకారం అందించనున్న ఎమ్మెల్యే ప్రతిపాదిత నూతన ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా మీడియాతో ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.... ధర్మపురి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, నూతన ఉత్సవ కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామనీ, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించాలని, ప్రతి ఒక్కరి పై స్వామీ వారి కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకింగ్ ఉచిత శిక్షణ ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానం
### బీసీ అభ్యర్థులకు మాత్రమే

జగిత్యాల మార్చ్ 18 ( ప్రజామంటలు):
హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ ద్వారా హైదరాబాద్ లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో 2 నెలల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు జగిత్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయి బాబా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తయిన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్ మరియు 26 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అభ్యర్థులు మార్చ్ 25.03.2024 వరకు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పై శిక్షణ కార్యక్రమానికి కేవలం బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ను 31.03.2024న ఉమ్మడి జిల్లా కరీంనగర్ లో నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు www.tsbcstudycircle. cgg.gov.in వెబ్ సైట్ లో 25.03.2024 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5.00 లక్షల లోపు ఉండాలి. ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ లో వచ్చిన మార్కుల ఆధారంగా (30) మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇవ్వబడుతుంది. మరింత సమాచారం కొరకు 040-29303130 ను సంప్రదించాలని సూచించారు.

## మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడండి
### చీమల దండును చూసి క్రమ శిక్షణ నేర్చుకోవాలి
### జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్షి విద్యా రణ్య భారతీ స్వామి

బుగ్గారం మార్చ్ 18 (ప్రజామంటలు):



పాశ్చాత్య దేశాలు కూడా మన హిందూ సంస్కృతి సంప్రదాయాలను అధ్యయనం చేసి అనుసరిస్తున్నాయని శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్షి విద్యా రణ్య భారతీ స్వామి (హంపి పీఠాధిపతి) అన్నారు. సోమవారం ఆయన జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని ద్వికోటి ద్వాదశ జ్యోతిర్లింగాలయంలోని ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా మాట్లాడారు. గత మూడు రోజుల నుండి ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అలగుర్తి లక్ష్మి నారాయణ స్వామి అధ్వర్యంలో స్వయంభూ నర్మదా నది నుండి తెచ్చిన బాణ లింగాలను ప్రతిష్ఠ చేశారు. సోమవారం శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. పలువురు వేద పండితులచే గత మూడు రోజులుగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హెూమాలు, యాగాలు, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్షి విద్యా రణ్య భారతీ స్వామి మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చీమల దండును చూసి మానవులు క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. ఎవరూ చెప్పకున్నా, ఆదేశించకున్నా చీమలు వరుస క్రమంలో పయనించడాన్ని మనం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దీపం వెలిగించడం, యాగాలు, ఉత్సవాలు జరుపుకోవడం, పుట్టిన రోజులు, ఇతరత్రా దినోత్సవాల గురించి వివరించారు. వాటి పద్ధతులు మార్చుకోవాలని బోధించారు. హిందూ సంస్కృతి లోనే ఇత్యాది ఉత్సవాలు జరుపుకుంటే మంచిదని ఆయన సూచించారు. మాజీ సర్పంచ్ అయిన శ్రీ సాంబ శివ నాగేశ్వరాలయ కమిటి చైర్మన్ మసర్తి రాజిరెడ్డి, గంజి జగన్, కటుకూరి ఆంజనేయులు, నరసాపురం రవీందర్, పెద్దనవెని రాగన్న, పలువురు ప్రముఖులు తదితరులతో పాటు, భక్తులు పాల్గొన్నారు.

## పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక పశు వైద్య శిబిరం





భీమదేవరపల్లి మార్చ్ 18 (ప్రజామంటలు) : పశువైద్య సేవలను రైతులకు మరింత చేరువగా అందించుటకు, పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా మామునూర్ పశువైద్య కళాశాల, హనుమకొండ జిల్లా పశుసంవర్ధక శాఖ సహకారంతో, జాతీయ సేవా పథకములో భాగంగా 7 రోజుల ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని గట్లనర్సింగాపూర్, ముత్తారం గ్రామంలో పశువైద్య శిబిరం డాక్టర్ మాలతిరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. ఈ ప్రత్యేక పశువైద్య శిబిరాలలో నిష్ణాతులైన పశువైద్య కళాశాల అధ్యాపక బృందం, పశువైద్యాధికారులు, జూనియర్ డాక్టర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మామునూరు పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట్ నారాయణ, కళాశాల వైద్య బృందం డాక్టర్ అమృత్ కుమార్, డాక్టర్ సురేష్ రాథోడ్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ రమ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రోజాశ్రీ, డాక్టర్ వి. భాస్కర్, ముల్కనూర్ మహిళా డైరీ అధ్యక్షురాలు ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి, పశు వైద్య కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వికాస తరంగిణి నుండి సుభాష్ రెడ్డి ,దయాకర్ రెడ్డి, ముల్కనూర్ డైరీ సభ్యులు, కారస్ కంపెనీ వీల్బాగ్ కంపెనీ సహకారం అందించారు. పశువులకు గర్భకోశ వ్యాధులు చికిత్స, పశువులకు వివిధ వ్యాధులకు చికిత్స, రోగ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు.

## అనర్హత నుంచి దానం తప్పించుకోలేరు
### స్పీకర్ త్వరగా వ్యవహారం తేల్చాలి: వినోద్

హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు):




కాంగ్రెస్లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం నాడు తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతంలో లాగా స్పీకర్ అనర్హత పిటిషన్పై జాప్యం చేసే పరిస్థితి సుప్రీంకోర్టు ఇటీవల ప్రకటించిన తీర్పుతో పోయిందని చెప్పారు. మహారాష్ట్రలో శివసేనను వీడిన ఏక్ నాథ్ షిండే గ్రూప్ ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు ఈ తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. మూడునెలల్లో నిర్ణయం తీసుకోవాలని మహారాష్ట్ర స్పీకరును కోర్టు ఆదేశించిందని చెప్పారు.స్పీకర్కు కోర్టులు కాలపరిమితి విధిస్తున్నందున అనర్హత పిటిషన్పై ఇక వాయిదాలు కుదరవని హెచ్చరించారు. దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పటి నుంచే ఆయన శాసన సభా సభ్యత్వం రద్దయినట్టేనని చెప్పారు. స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కాంగ్రెస్ దివంగత నేత రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నపుడే 1985లో రూపొందించారని అన్నారు. రాజీవ్ గాంధీ మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా కాంగ్రెస్ నేతలు ఫిరాయింపులు ప్రోత్సహించకూడదని చెప్పారు. ప్రతిమ మల్టీప్లెక్స్లో ఎన్నికల అధికారులకు దొరికింది తన బంధువుల డబ్బులు అని తనకు ఏం సంబంధం లేదని వినోద్ కుమార్ అన్నారు.

## అకాల వర్షాలతో అన్నదాతల ఆందోళన
### వర్షాలతో మిర్చి రైతుల్లో గుబులు

వరంగల్,మార్చి18 (ప్రజామంటలు):
అన్నదాతలను ప్రకృతి పగబట్టింది. వాతావరణంలో ఏర్పడిన మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. చేతికందిన పంట వర్షార్పణం అయిపోతుండటంతో రైతులు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. మిర్చి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. అసలే ఈ ఏడాది మిర్చికి సరైన ధర లేక తలలు పట్టుకుంటున్న రైతులకు ఇప్పుడు వాతావరణ ప్రతికూల పరిస్థితులు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. చేతికి అందిన వరి, మిర్చి పంటను కాపాడుకోవడం కోసం పడరానిపాట్లు పడుతున్నారు రైతన్నలు. కలాల్లో అరబోసిన మిర్చి పంటను పాలిథిన్ కవర్లతో కప్పి వర్షంలో తడవకుండా కాపాడు కుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి వాతావరణంలో మార్పులు సంభవించాయి. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చేతికి అందిన పంట పూర్తిగా వర్షాలపాలైపోతుందని దిగులుతో తలలు పట్టుకుంటున్నారు.

## మాజీ ఎమ్మెల్యే షకీల్కు షాక్
### హిట్ అండ్ రన్ కేసు ఓపెన్ చేసిన పోలీసులు


హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు):



బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కు బిగ్ షాక్ తగిలింది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో హిట్ అండ్ రన్ కేసు ను పోలీసులు రీ ఓపెన్ చేశారు. మార్చి 17- 2022లో రోడ్ నెంబర్ 45లో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రోడ్డు దాటుతున్న 2 ఏళ్ల బాలుడుపై కారు దూసుకెళ్లింది. బాలుడిని ఢీ కొట్టిన కారు మాజీ ఎమ్మెల్యే షకీల్కు చెందినదిగా అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. మీర్జా ఇన్ఫ్రా పేరుతో కారు రిజిస్ట్రేషన్ అయినట్లు పోలీసులు గుర్తించారు. కానీ షకీల్పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రోడ్డుపై బెలూన్స్ అమ్ముకొనే కుటుంబం రోడ్డు దాడుతుండగా ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కారుపై ఎమ్మెల్యే షకీల్ పేరుతో స్టిక్కర్ ఉన్నట్లు గుర్తించారు. అది తన కారు కాదని.. స్టిక్కర్ను తన స్నేహితుడికి ఇచ్చినట్లు అప్పట్లో మాజీ ఎమ్మెల్యే షకీల్ చెప్పారు. ఆ కారు ప్రమాదంలో డ్రైవ్ చేసిన వ్యక్తిని కాకుండా మరొకరిపై జూబ్లీహిల్స్ పోలీసులు ఛార్జ్ షీట్ వేశారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఇప్పుడు మరో సారి కేసును రీ ఓపెన్ చేశారు. దీంతో ఏం జరగబోతుందనేది ఉత్కంఠగా మారింది.

## మల్లారెడ్డి అగ్రికల్చర్ కాలేజీల్లో అధిక ఫీజులు
### ఆందోళనకు దిగిన విద్యార్థులు

హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు):




మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల చదువు విషయంలో కనీస రూల్స్ పాటించకుండా అశ్రద్ధ హిస్తున్నారని స్టూడెంట్స్ (÷ూబిబీట।నిబిబ) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల విషయంలో ఉన్న శ్రద్ధ.. విద్యార్థుల చదువు విషయంలో లేదని అగ్రికల్చర్ యూనివర్సిటీ ముందు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బీఎస్సీ అగ్రికల్చర్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పరీక్ష విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గత కొద్ది రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్తున్నా స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ఫర్నిచర్ను ధ్వంసం చేసిన విద్యార్థులు... మల్లారెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు మైనం పల్లి హనుమంత్ రావు కాలేజ్కు వచ్చారు. కళాశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆయన.. పిల్లలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని, సత్వరమే విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం మీతరం కాదు
### బిఆర్ఎస్ గతంలో ఏం చేసిందో చూసుకోవాలి
### బిజెపి, బిఆర్ఎస్లపై మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యే


హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు):



కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరం కాదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్రెడ్డి అన్నారు. సోమవారం నాడు గాంధీభవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని మోదీ జగిత్యాల సభలో పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని మాట్లాడడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వాలను కూలగొట్టడమే లక్షంగా బీజేపీ పనిగట్టుకుందని మండిపడ్డారు. పార్టీలో చేరడానికి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎవరు ముందుకు వచ్చినా పార్టీలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్లో చేరితే గులాబీ నేతలు గగ్గోలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు గులాబీ పార్టీ నేతల తీరు ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిన చరిత్ర కేసీఆర్ పార్టీదని చెప్పారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలలు కంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఐదేళ్లు ఎలా కొనసాగించాలో తమకు తెలుసునని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను సీఎం రేవంత్రెడ్డి నెరవేరుస్తారని ఎమ్మెల్యే రామ్మోహన్రెడ్డి తెలిపారు.
అయితే బీఆర్ఎస్ నేతల పై కాంగ్రెస్ పార్టీకి చెందిన పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు. పదేళ్ల పాటు విచ్చలవిడిగా ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆర్ కాదా..? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ చివరకు సీపీఐ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకోలేదా..? అని మండిపడ్డారు. తెలంగాణ పునర్ నిర్మాణం పేరుతో శాసనసభ్యులను చేర్చుకున్నది మీరు కాదా..? పదేళ్లలో ఇతర పార్టీల నుంచి మొత్తం 39 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుందని ఎమ్మెల్యే తెలిపారు. 2014లో 23 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకుందని.. ఇందులో టీడీపీ నుంచి 12 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, వైసీపీ నుంచి ముగ్గురు, బీఎస్పీ నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరిని చేర్చుకున్నారని ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి తెలిపారు. 2018లో 16 మందిని చేర్చుకోలేదా..? అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీష్ రావు ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ తిరిగి ప్రలోభపెట్టింది మరిచిపోయారా అని అన్నారు. టీడీపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే తలసానితో రాజీనామా చేయించకుండా మంత్రి వర్గంలోకి తీసుకోలేదా..? అని పేర్కొన్నారు. కాంగ్రెస్ లో గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని మీ మంత్రివర్గంలోకి తీసుకోలేదా.. అప్పటి స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి అనర్హత పిటిషన్ల పైన చర్యలు తీసుకున్నారా..?అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి బీఆర్ఎస్, బీజేపీ కుట్రలు చేశాయని ఆరోపించారు. ప్రమాణస్వీకారానికి ముంది కడియం శ్రీహరి ప్రభుత్వం కూలిపోతుందన్నారు.. త్వరలో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని కేటీఆర్ అనలేదా అని ప్రశ్నించారు.

## శ్రీరాచంద్రుడిగా దర్శనమిచ్చిన నారసింహుడు

యాదగిరిగుట్ట,మార్చి18 (ప్రజామంటలు):



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం నారసింహుడు శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ఆయల మాడవీధుల్లో ఊరేగించారు. సోమవారం రాత్రి స్వామివారికి తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించ నున్నారు. కాగా, గుట్టలో భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నది. ఉచిత దర్శనానికి గంటా 30 నిమిషాలు, రూ.150 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సుమారు గంట సమయం పడుతున్నది.


## ఎమ్మెల్యే దానంపై అనర్హత వేటు వేయండి
### స్పీకర్ గడ్డం ప్రసాద్ను కోరిన బిఆర్ఎస్

హైదరాబాద్, మార్చి18 (ప్రజా మంటలు):



కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్పై అనర్హత వేటు వేయాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. స్పీకర్కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో పాడి కౌశిక్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్పై చర్యలు తీసుకోవాలని స్పీకర్ను కోరామని తెలిపారు. యాక్షన్ తీసుకుంటామని స్పీకర్ చెప్పినట్లు పేర్కొన్నారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరే ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలని మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మా పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను ఎలా తీసుకుంటారు అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని రేవంత్పై కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు స్పీకర్కు వినతిపత్రం సమర్పించారు.దానం నాగేందర్ ను డిస్ క్వాలి÷ చేయాలని స్పీకర్ ను కలిసి పిటిషన్ ఇచ్చామన్నారు. స్పీకర్ నిర్ణయం తీసుకుంటా అన్నారని తెలిపారు. దానంను బీడీలు అమ్ముకునే వారని రేవంత్ అన్నారని.. మరి అలాంటి వ్యక్తిని ఎందుకు చేర్చుకున్నారని ప్రశ్నించారు. మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పు ఉందని.. రేవంత్ రెడ్డి మీరు కొట్టారు మేం తీసుకున్నాం.. ఇక మేము కొట్టినప్పుడు మీరు లేవలేరని తెలిపారు. మేము గేట్లు ఎత్తినప్పుడు మీరు భూ స్థాపితం అవుతారని రేవంత్ను పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాల్లో మోడీ జోష్





సార్వత్రిక ఎన్నికల నగారా మోగడం ఆలస్యం..బిజెపి రంగంలోకి దూకింది. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో మోడీ పర్యటనతో జోష్ నింపింది. ఏకకాలంలో రెండు రాష్ట్రాల్లో మోడీ సభలు విజయవంతం అయ్యాయి. మల్కాజిగిరిలో రోడ్ షోతో మొదలు, నాగర్ కర్నూలు, జగిత్యాలలో భారీ బహిరంగ సభలు నిర్వహిం చారు. అలాగే ఎపిలో కూడా మోడీ శంఖారావం పూరించారు. టిడిపి-జనసేన కూటమితో కలసి తొలిసారిగా ఎన్నికల రంగంలోకి దిగారు. మోడీ రాకతో బిజెపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అలాగే చేరికలను కూడా బిజెపి ప్రోత్సహిస్తోంది. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరేవారితో బిజెపి కొంత బలం పుంజుకుంది. మోడీ గ్యారెంటీ పేరుతో ఎక్కడికి వెళ్లినా ప్రధాని మోడీ మార్మోగిస్తున్నారు. జైభారత్, జాశ్రీరామ్ నినాదాలు మోగిస్తున్నారు. ప్రజలు కూడా మోడీపట్ల సానుకూలతనే ప్రకటిస్తున్నారు. స్థానికంగా బిజెపికి ఎలాంటి బలం లేకున్నా మోడీ మేనియా ఉందనడంలో సందేహం లేదు. ఇకపోతే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలతో బిజెపి తీరుగలేని ఆధిపత్యం సాధించింది. బిజెపికి ప్రత్యామ్నాయం అంటూ తొడగొట్టిన పార్టీలన్నీ చతికిల పడ్డాయి. మోడీ, అమిత్ షాల వ్యూహం ముందు ఇప్పుడు ఎవరి వ్యూహం పనిచేయడం లేదు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఎలాంటి వ్యూహం అనుసరిస్తాయన్నదే ముఖ్యం. ఎందుకంటే మోడీ వ్యూహం ఇప్పటికే సిద్ధం అయి ఉంటుంది. అది ఏంటన్నది త్వరలో బయటకు రానుంది. ఈ క్రమంలో విపక్షం నుంచి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిగా ఎవరు ఉంటున్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్‌తో కలిసి ఉమ్మడి ప్రధాని అభ్యర్థిని ప్రకటించే విషయంలో ఏ ఒక్క పార్టీ కూడా ఇప్పటికీ ప్రయత్నాలు మొదలు పెట్టలేదు. ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తామని ప్రకటించిన కెసిఆర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో చలతికిల పడ్డారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు తరవాత అనూహ్యంగా బీహార్ సిఎం నితీశ్ కుమార్ మరోమారు ఎన్డీఏ గూటికి చేరడంతో ఇండియా కూటమి బలహీనపడింది. ఎపిలో జగన్ ప్రభుత్వం తీరుపై మోడీ తొలిసారిగా ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపైనా మోడీ విమర్శలు గుప్పిం చారు. ఈ క్రమంలో మరోసారి పీఠమెక్కడానికి బిజెపి సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు ఇదే సరైన సమయం అయినా అది గట్టిగా నిలబడలేక తంటాలు పడుతోంది. ఎన్నికల్లో ఎన్‌డిఎకు గట్టి పోటీ ఇస్తారా లేదా అన్నది చూడాలి. విపక్షాలు ఐక్యతకు కూడా ఇదో పరీక్ష. ఇక్కడి నుంచే ఇక ఉమ్మడి ఎజెండాతో ముందుకు సాగితే సానుకూల అవకాశాలు ఉంటాయి. మోడీని ఎన్నికల్లో మాత్రమే ఎదరించకుండా..మోడీ విధానాలను ఎదరించేందుకు ఇక నిరంతరంగా శ్రమించాల్సిన బాధ్యతను తీసు కుంటే తప్ప ప్రజలు నమ్మరు. అందుకు ప్రాంతీయ పార్టీలు అనుసరించే వ్యూహం ఏంటన్నది మున్ముందు బయటపడనుంది. ఇదిలావుంటే లోక్‌సభ ఎన్నికలు తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకూ విషమ పరీక్షగా ఉండబోతున్నాయి. దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగాలంటే ఆ పార్టీ కనీసం ఓ పది లోక్‌సభ సీట్లు గెలవగలగాలి. లేకుంటే కష్టమే కాగలదు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని కొట్టేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీ, తన ఆకాంక్ష నెరవేరాలంటే కనీసం ఐదారు స్థానాలు గెలుచుకోవాలి. మూడు నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి విచిత్రమైన పరిస్థితిలోకి జారిపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు మూడు స్థానాలైనా గెలుచుకొని సగం పైగా స్థానాలలో ద్వితీయ స్థానంలో నిలబడని పక్షంలో ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం భారత రాష్ట్ర సమితి ఒకటి రెండు స్థానాలైనా గెలుస్తుంది అన్న ప్రశ్న రాజకీయ పరిశీలకుల నుంచి వినిపిస్తోంది. ఎందుకంటే ఆ పార్టీలో ఇప్పుడు పోటీకి అభ్యర్థులు వెనక్కి తగ్గారు. దక్షిణ తెలంగాణలోని కొన్ని స్థానాలలో ఆ పార్టీ ద్వితీయ స్థానానికే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రధాన పోటీ కాంగ్రెస్-బీజేపీ మధ్యనే కేంద్రీకృతం అయిందన్న అభిప్రాయం బలంగా వ్యాపిస్తోంది. మరోవైపు బిఆర్ఎస్ నుంచి ఎంపిలు, ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీలు కొందరితో పాటు మాజీ ఎంపీలు సైతం పార్టీని వదిలి బీజేపీలో చేరుతున్నారు. ఎన్నికల వరకు ఎమ్మెల్యేలు అందరూ ఐక్యంగా పార్టీకి అండగా ఉంటారా? అన్న సందేహాలు కూడా మొదలయ్యాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ముఖ్యులతో టచ్‌లోకి వెళ్లారు. దానం లాంటి వారు అడుగేశారు. కాంగ్రెస్ గేట్లు తెరిచిందని సిఎం రేవంత్ ప్రకటించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకొనే విషయంలో ఇంతకాలం విముఖంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాజాగా మనసు మార్చుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. గతంలో కేసీఆర్‌కు కూడా ఇలాగే వ్యవహరించి తోవచూపారు. ఇకపోతే జగన్ సర్కార్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన తొలి సభ సక్సెస్ అయ్యింది. ఏపీ సీఎం జగన్ అధికారం, డబ్బు అండతో విర్రవీగుతున్నారని మూడు పార్టీల నేతలు విరుచుకుపడ్డారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఏర్పాటు చేసిన 'ప్రజాగళం' బహిరంగ సభకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాలతో సీఎం జగన్ బినామీలు రూ.40 వేల కోట్లు దోచేశారు. రాష్ట్రం డ్రగ్స్ కు రాజధానిగా మారింది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి దిగజారిపోయింది. ఏపీకి రావాల్సిన ఎన్నో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ఇలా జగన్ అవినీతి వల్ల ఎపి అభివృద్ధి వెనక్కి పోయిందని విరుచుకుపడ్డారు. మొత్తంగా టిడిపి కూటమిలో మోడీ రాకతో జోష్ నిండింది. రెండు రాష్ట్రాల్లో మోడీ మేనియా ఏ మేరకు పనిచేస్తుందో చూడాలి.

## బడుగుల అండను కోల్పోతున్న బిఎస్పీ

### ఆత్మపరిశీలన చేసుకోని మాయావతి - ప్రవీణ్ కుమార్ నిర్ణయం శరాఘాతం




హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు): ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో తెలంగాణలో ఐపిఎస్ పదవికి రాజీనామా చేసి బిఎస్పీలో చేరిన ప్రవీణ్ కుమార్ లాంటి వారికి ఈ ఫలితాలు నిస్తేజం కలిగించేవే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బిఎస్పీ తెలంగాణలో ఎక్కడా ప్రభావం చూపలేదు. అలాగే బిఎస్పీ అద్యక్షుడు ప్రవీణ్ కుమార్ కూడా ఓటమి చెందారు. ఈ క్రమంలో అనూహ్యంగా యాన రాజీనామా చేయడం, బిఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించడంతో పరువు పోగొట్టుకున్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని వమిర్శించి ఇప్పుడు అదే పార్టీలో చేరడం ద్వారా విలువలను తుంగలో తొక్కారు. తానే నామమాత్రపు రాజకీయనేతనని చాటుకున్నారు. దీంతో తెలంగాణలో ఇక బిఎస్పి ప్రస్థానం ముగిసినట్లుగనే భావించాలి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే.. బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. ప్రియాంక పగ్గాలు తీసుకొని ప్రచారం చేసినా, యూపీలో 3 శాతం కన్నా తక్కువ ఓట్లకే కాంగ్రెస్ పరిమితమైతే, బిఎస్పీ అంతకన్నా దారుణ పరాభవాన్ని మూట కట్టుకుంది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారీ పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. గూండాగిరీకి దూరంగా శాంతిభద్రతల పానలపై ప్రచారం యూపీలో బీజేపీకి కలిసొచ్చాయి. ఇంటింటా ఎన్నికలలో గెలుపోటములు ఎక్కువగా సెంటిమెంట్ అంశాల మీదే తప్ప, అసలు వాస్తవాల మీద ఆధారపడి ఉండవు. అయితే ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే ఈ ప్రయత్నం తాజా ఎన్నికల్లోనూ ఫలించింది. పార్టీ అధికారంలో ఉన్న యూపీలో లఖీమ్‌పూర్ ఖేరీ, హాథ్రస్ లాంటి ఘటనలు, ఉత్తరాఖండ్‌లో సీఎంల మార్పులు, గోవాలో అంతర్గత బలహీనతల లాంటి ప్రతికూలతలున్నా ఓటర్ల తీర్పు మాత్రం బీజేపీకే అనుకూలించింది. పోటాపోటీ ఉంటుందన్న ఉత్తరాఖండ్‌లో తుది తీర్పూ కాంగ్రెస్‌కు షాక్ కలిగించింది. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను ఈ ఎన్నికలు కలిగించాయి. విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఆప్, బిజెపిలకు మళ్లుతోందని గుర్తించాలి. అదే సందర్భంలో పర్మినెంట్ ఓటు బ్యాంక్ కూడా ఇక ఉండబోదన్న సంకేతాలను గుర్తించాలి. కొత్త ఓటర్ల రాక,యువత ఆలోచనలు మారడం లాంటివి కూడా సంప్రదాయ ఓటుబ్యాంక్‌ను దెబ్బతీస్తున్నాయి. మోదీ పాపులారిటీకి యువత ఆకర్శితులు అవుతున్నారు. ఇప్పటికైనా నాయకత్వ లోపాలను సరిదిద్దుకోకపోతే బిఎస్పీకి భవిష్యత్తు కష్టమే.


## రచయితలకు, కవులకు ఆహ్వానం

కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన "నేటి కథ" శీర్షిక మళ్ళీ ప్రారంభిస్తున్నాం. అలాగే కవితలను కూడా వారంలో ఒక రోజు ప్రచురించనున్నాం. మీ రచనలను, సామాజిక స్పృహతో, నేటి తరానికి మన సంస్కృతి, వారసత్వాన్ని అందించే కథలకు, కవితలను ఆహ్వానిస్తున్నాం. మీ కాలానికి పదను పెట్టి, సమాజాన్ని తీర్చిదిద్దే రచనలను సృష్టించాలని, తార్కిక, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా, సామాజిక అంశాలను కథావస్తువుగా తీసుకొని రచనలు చేయాలని మా విజ్ఞప్తి. మీ రచనలను ఈ కింది ఈ మెయిల్ కు పంపండి. మీ రచనతో పాటు హామీని, మీ పూర్తి చిరునామాను, ఫోటో ను కూడా జతచేయడం మరవకండి. మీ రచనలను వర్డ్ డాక్యుమెంట్, పేజ్ మేకర్ 7.0 ఓపెన్ ఫైల్ గా మాత్రమే పంపండి. కథలను 400- 500 ల పదాలకు పరిమితం చేస్తే బాగుంటుంది.

ఇక మీదే ఆలస్యం ..

Email : mantalukathalu@gamil. Com

ఎడిటర్.


# గేట్లు తెరిచిన కాంగ్రెస్

**కెసిఆర్ చూపిన బాటలో పయనం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికే లక్ష్యం**


**పార్లమెంట్‌లో పది స్థానాలు గెలవాలన్న పట్టుదల**





హైదరాబాద్,మార్చి18 (ప్రజామంటలు): కాంగ్రెస్ గేట్లు తెరిచింది. పార్లమెంట్ ఎన్నికల ముందు వ్యూహాత్మకం గా పార్టీలోకి చేరికలు మొదలయ్యాయి. దానం నాగేందర్, రంజిత్ రెడ్డిలు తొలి అడుగు వేశారు. ఇప్పటికే పసునూరి దయాకర్, కోరేరు కోనప్ప కూడా చేరారు. ప్రధానంగా ఎంపి ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించారు. కెసిఆర్ చూపిన తోవలేనే నడుస్తున్నారు. గతంలో అంటే 2014లో టిఆర్ఎస్‌కు 63 మంది ఎమ్మెల్యేలే ఉండేవారు. దీంతో ప్రభుత్వ సుస్థిరత కోసం తెలుగుదేశం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కెసిఆర్ టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. రాజకీయ పునరేకీకరణ అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ బలం కూడా 64 కావడం విశేషం. ఈ కారణంగా నాడు కేసీఆర్ చూపిన బాటలో ఇప్పుడు తాము కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పేమిటి అని కాంగ్రెస్ ముఖ్యులు ప్రశ్నిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం జంట నగరాలు, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లోకి వెళ్లారు. చేరికలకు తలుపులు తెరిస్తే గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా మిగలకపోవచ్చునని అంటున్నారు. ప్రస్తుతానికి ఇద్దరు మినహా మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖత వ్యక్తంచేస్తున్నారు. తమాషా ఏమిటంటే, గ్రేటర్‌లో గెలిచిన శాసనసభ్యులు అందరూ గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ తరఫున గెలిచి బీఆర్ఎస్‌లో చేరినవారే. తాజా సమాచారం ప్రకారం పదిహేను మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌తో పాటు, రంగారెడ్డిలో బిఆర్ఎస అత్యధికంగా సీట్లు గెల్చుకోవడంతో ఆ పార్టీ 39 స్థానాల్లో గెలుపొందింది. మేం గేట్లు తెరిస్తే బిఆర్ఎస్‌లో ఆ ముగ్గురే మిగులుతారని సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. అంటే ఆ ముగ్గురు తప్ప అందరినీ చేర్చుకునే కార్యక్రమం మొదలయ్యిందా అన్నది చూడాలి. లోక్‌సభ ఎన్నికలలోపే ఈ చేరికలు జరిగిపోతే భారత రాష్ట్ర సమితికి కోలుకోలేని దెబ్బ తగలడం ఖాయంగా ఉంది. ఫిరాయింపులకు గతంలో తెర లేపింది కేసీఆరే కనుక ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే పనిచేసినా వారిని ప్రశ్నించే నైతికత వారికి లేదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మలచుకోవడానికి కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. 2014లో అత్తెసరు మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చినందున ఫిరాయింపులను ప్రోత్సహించినా కేసీఆర్‌ను ప్రజలు సమర్థించారు. 2018లో 88 స్థానాలను గెలుచుకున్నప్పటికీ ఫిరాయింపులను ప్రోత్సహించడాన్ని ప్రజలు ఆక్షేపించారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరడానికి ముందుకొచ్చే శాసనసభ్యులకు తలుపులు తెరవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు తాము ఆ పనిచేయకపోతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారతీయ జనతా పార్టీలో చేరిపోతారని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో చేరికలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం పది స్థానాలను గెలవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యంగా ఉంది. ఇన్ని సీట్లు గెలిస్తే తప్ప కాంగ్రెస్ పదిలంగా ఉండదు. ఇందుకోసం రేవంత్ రెడ్డి వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికలు తమ వందరోజుల పాలనకు రెఫరెండంగా ప్రకటించారు. గెలిచినా, గెలవకపోయినా తనదే బాధ్యతని అన్నారు. ఇక భారతీయ జనతా పార్టీ విషయానికి వస్తే, ఆ పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను మాత్రమే గెలుచుకున్నప్పటికీ ప్రస్తుతం మంచి ఊపు మీదే ఉంది. దక్షిణ తెలంగాణలో పార్టీ బలహీనంగా ఉన్న విషయాన్ని గమనించిన కమలనాథులు ఆ దిశగా దృష్టి సారించారు. ప్రజల్లో పట్టున్న నాయకులను గుర్తించి ఎంపీ అభ్యర్థులుగా బరిలో దించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఖమ్మం నుంచి జలగం వెంకట్రావ్, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్‌ను పార్టీలో చేర్చుకున్నారు. గత ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు అంతకంటే ఎక్కువ సీట్లు గెలుచుకోవడం కోసం పావులు కదుపుతోంది. ఐదు, అంతకు మించి సీట్లు గెలుచుకోగలిగితే రాష్ట్రంలో బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరిస్తుంది. ఈ క్రమంలో బిఆర్ఎస్‌ను బలహీన పరిచే కార్యక్రమంలో వారు కూడా అడుగులు వేస్తున్నారు. కవిత అరెస్ట్‌తో కెసిఆర్, ఆయన కుటుంబం ఆ వైపు దృష్టి సారించింది. ఇప్పుడు పార్టీలో ఏం జరుగుతున్నా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాని మోదీ ఇప్పటికే తెలంగాణలో రెండు రోజులు ప్రచారం చేశారు. తెలంగాణలో బలపడితే ఆ తర్వాత ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించవచ్చునన్నది కమలనాథుల వ్యూహంగా ఉంది. తెలంగాణలో దూకుడు ప్రదర్శిస్తే మెజారిటీ సీట్లు గెలుచుకోవచ్చునని బిజెపి నేతలు లెక్కలు వేసుకుం టున్నారు.ప్రధాని మోదీ గ్లామర్ అదనపు బలం కనుక లక్ష్య సాధన అసాధ్యం కాదని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థతకు గీటురాయి కానుంది. ఇందులో అసలు సిసలు విషమ పరీక్షను కేసీఆర్ ఎదుర్కోబోతున్నారు.


## లోక్‌సభ అభ్యర్థుల పేర్లను ప్రకటించిన ఒవైసీ



హైదరాబాద్,మార్చి18 (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల తేదీల ప్రకటనతో రాజకీయ పార్టీలన్నీ యాక్టివ్‌గా మారాయి. ఎన్నికల ప్రకటన తర్వాత ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) కూడా యాక్టివ్‌గా మారింది. ఇదిలా ఉండగా వచ్చే ఎన్నికలకు ముగ్గురు అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. ఇందులో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా ఉన్నారు. అభ్యర్థుల పేర్లను ప్రకటించిన ఒవైసీ, ఔరంగాబాద్ నుంచి ఏఐఎంఐఎం అభ్యర్థిగా ఇంతియాజ్ జలీల్, కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్ ఇమాన్ పోటీ చేస్తారని చెప్పారు. అదే సమయంలో ఒవైసీ స్వయంగా హైదరాబాద్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర అభ్యర్థులపై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చర్చిస్తున్నారని.. త్వరలో అక్కడ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు. బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏఐఎంఐఎం నుంచి ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే దానిపై ఒవైసీ ప్రస్తుతానికి చెప్పలేదు. గతంలో సయ్యద్ ఇంతియాజ్ జలీల్ మాట్లాడుతూ మహారాష్ట్రలో ఆరు స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. ముంబై, ఛత్రపతి శంభాజీనగర్, నాందేడ్, ధూలేతో పాటు మహారాష్ట్రలోని తూర్పు ప్రాంతంలోని విదర్భ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థులను బరిలోకి దించనుంది.బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర అభ్యర్థులపై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చర్చిస్తున్నారని, త్వరలో అక్కడ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు. బీహార్‌లోని 11 స్థానాల్లో తన అభ్యర్థులను నిలబెట్టనుంది. దీంతో పాటు ఈసారి ఉత్తరప్రదేశ్‌లో కూడా పార్టీ తన హస్తాన్ని చాటనుంది. బీహార్, యూపీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఒవైసీ ప్రకటించడంతో ఇండియా కూటమిలో భయాందోళనలు నెలకొన్నాయి. ఓవైసీ అభ్యర్థి అయితే ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్లను చీల్చవచ్చునని భావిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఇంతియాజ్ జలీల్ ఔరంగాబాద్ స్థానం నుంచి గెలుపొందగా, అక్తరుల్ ఇమాన్ బీహార్ అసెంబ్లీ ఎమ్మెల్యే, ఒవైసీ హైదరాబాద్ నుంచి ఎంపీగా ఉన్నారు.

## తమిళనాడు టూర్‌లో బాంబు బెదిరింపు

### ప్రధాని మోడీకి భద్రత కట్టుదిట్టం



కోయంబత్తూర్, మార్చి 18 (ప్రజా మంటలు): దక్షిణాది రాష్ట్రాలే లక్ష్యంగా ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత కొద్దిరోజులుగా కేరళ, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మోడీ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్డీఏకి 400 సీట్లు ఇవ్వాలని మోడీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉంటే సోమవారం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో మోడీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటకలో ఎన్నికల ప్రచారం ముగియగానే తమిళనాడు కోయంబత్తూర్‌లో మోడీ భారీ రోడ్ షో నిర్వహించారు. అయితే మోడీ రోడ్ షో నేపథ్యంలో బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పోలీసులు కోయంబత్తూర్‌లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వాస్తవానికి తొలుత మోడీ షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అనంతరం మద్రాస్ హైకోర్టు అనుమతి ఇవ్వడంతో మోడీ భారీ ఎత్తున రోడ్ షో నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ కోయంబత్తూరు పర్యటనకు కొన్ని గంటల ముందే బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ వార్తల నేపథ్యంలో భారీ భద్రత మధ్య కోయంబత్తూరులో రోడ్‌షో నిర్వహించారు. కోయంబత్తూరు విమానాశ్రయంలో కూడా ఐదు అంచెల భద్రతను అమలు చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ , కోయంబత్తూర్ సిటీ పోలీస్ మరియు అనేక ఇతర విభాగాల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీల తర్వాత మోడీ రోడ్ షో నిర్వహించారు. నగరంలోని మెట్టుపాళయం దగ్గర ప్రారంభమైన మోడీ రోడ్ షో.. ఆర్ఎస్ పురం దగ్గర ముగియనుంది. అనంతరం కన్యాకుమారిలో జరగనున్న సభలో మోడీ మాట్లాడనున్నారు.గత శనివారమే దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏడు విడతల్లో పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 19న పోలింగ్ ప్రారంభమై జూన్ 1న ముగియనుంది. జూన్ 4న ఫలితాలు విడుదలకానున్నాయి. ఇదిలా ఉంటే ఈసారి ప్రధాని మోడీ దక్షిణాది రాష్ట్రాలపై ఎక్కువ దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. మోడీ ఎక్కువ సార్లు ఈ ఐదు రాష్ట్రాల్లోనే ఎక్కువగా పర్యటిస్తున్నారు. సౌతిండియాలో బీజేపీకి మొదటి నుంచి బలం తక్కువగా ఉంటుంది. అందుకోసమే ఈసారి మోడీ దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, కడియం ఫౌండేషన్ ఛైర్మన్ కడియం కావ్యను కలిసిన నారాయణగిరి గ్రామస్తులు

**పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు - భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని హామీ**



ధర్మసాగర్ మార్చ్ 18 (ప్రజామంటలు): బీఆర్ఎస్ పార్టీ వరంగల్ లోకసభ ఎంపీ అభ్యర్థి, కడియం ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కడియం కావ్యను గెలిపించేందుకు కృషి చేస్తామని నారాయణగిరి బీఆర్ఎస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. సోమ వారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు వల్లపురెడ్డి రాం రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను కలిశారు. వరంగల్ లోకసభ ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వల్లపు రెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమారస్వామి, కడియం యువసేన అధ్యక్షుడు గంటే కృష్ణ, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోలను మధుకర్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ మడికంటి సాయిబాలు, వేములకొండ సంపత్, వల్లపు రెడ్డి, రాజీమ్మ రెడ్డి, వక్కల శ్రీను, వక్కల వీరన్న, బుక్యా రాజు, వక్కల రాజు, గొట్టిముక్కుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ద్వారా మానవీయ విలువలు

### జీవన నైపుణ్యాలు అభివృద్ధి



కొడిమ్యాల మార్చ్ 18 (ప్రజామంటలు): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవ రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉదయం శ్రమదాన కార్యక్రమంలో భాగంగా కొడిమ్యాల బస్ స్టేషన్ మరియు దాని పరిసరాలలో గల పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని మరియు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. అలాగే అంబేద్కర్ విగ్రహం ఆవరణలో మొలచిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం మధ్యాహ్నం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ మరియు జిల్లా మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె. మురళి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను జీవన నైపుణ్యాలు మానవీయ విలువల ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. సామాజిక అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకమని కొనియాడారు. ఈ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా శ్రమ విలువను తెలుసుకుంటూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. మరొక అతిథి జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షులు వి. రాంరెడ్డి మాట్లాడుతూ.... మానవ వనరుల అభివృద్ధి దాని ప్రాముఖ్యత గూర్చి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్ గోపికృష్ణ, కే సతీష్ కుమార్, కొడిమ్యాల గ్రామం మాజీ ఉపసర్పంచ్ జి. జీవన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, సీనియర్ వాలంటీర్లు ఎం. రవి చందర్, యు. ఆదిత్య మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# జగిత్యాల బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ



జగిత్యాల మార్చ్ 18 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా గీతా విద్యాలయంలో గ్రౌండ్ లో బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ. భారత్ మాతా కి జై , నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ. జగిత్యాలలో తనకు ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపంలో కన్పిస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల పండగ మొదలైందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య ఉత్సవానికి తొలి అడుగుపడిందన్నారు.. తెలంగాణలో బీజేపీకి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే 13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని అంటూ వికాసం కోసం తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు.

### తెలంగాణను దోచుకున్న వారిని ఎవ్వరినీ వదిలిపెట్టం ప్రధాని నరేంద్ర మోడీ

నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గంలో భాగమైన జగిత్యాలలో జరిగిన విజయ సంకల్ప బహిరంగ సభకు మోడీ హాజరయ్యారు. కాళేశ్వరంలో అవినీతి, లిక్కర్ స్కామ్ లో కవిత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భారీ అవినీతికి పాల్పడిందంటూ, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కెసిఆర్ కుమార్తె కవిత కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఈ స్కామ్ లో ఆమెకు భాగస్వామ్యం ఉందని, అవినీతికి ఎవరు పాల్పడినా సహించబోనని, ఎంతటి పెద్దవారైన జైలుకు పంపుతానని తేల్చి చెప్పారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కొత్తగా ఇక్కడ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ దోచి ఢిల్లీ పార్టీకి పంపుతుందని ధ్వజమెత్తారు.. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు ఒక్కటే అన్నారు. జూన్ 4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు. విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందన్నారు. రాహుల్‌గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు. శక్తిని ఎవరైనా నాశనం చేయగలరా, శక్తిని వినాశనం చేస్తానని ఎవరైనా అంటారా అని మోదీ ప్రశ్నించారు. శక్తి వినాశనం చేసేవాళ్లకు శక్తి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరుగుతుందని పేర్కొన్నారు. శక్తి రూపంలో మహిళలు తనను ఆశీర్వదించేందుకు వచ్చారని, ఇది తన భాగ్యమని తెలిపారు. శక్తి స్వరూపులైన ప్రతి మాత, సోదరి, కుమార్తెలకు తాను పూజారినని చెప్పారు. శక్తి స్వరూపులైన మహిళల రక్షణ కోసం తాను ప్రాణాలు అర్పించేందుకు సిద్దంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను భారతమాత పూజారినని పేర్కొన్నారు., చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతాన్ని కూడ శివశక్తి అని పేరు పెట్టుకున్న విషయాన్ని మోడీ గుర్తు చేశారు. శక్తిని నాశనం చేసేవారికి, శక్తిని పూజించేవారికి మధ్య పోరాటం సాగుతుందన్నారు.

### తెలంగాణ చైతన్య గీతిక సుద్దాల అశోక్ తేజ

### సినీ రచయిత అశోక్ తేజ ను సన్మానించిన టీపీసీసీ ఎన్ఆర్ఐ కన్వీనర్ డా. చాంద్ పాషా

జగిత్యాల మార్చ్ 18 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని ప్రముఖ రచయిత కందుకూరి నరేందర్ ఇంటికి వచ్చిన సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ ను ఆదివారం టీపీసీసీఎన్ఆర్ఐ కన్వీనర్, గల్ఫ్ రిటర్న్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చాంద్ పాషా మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ తో తన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఆరేళ్ల క్రితం బెంగళూర్ లో జరిగిన ఓ కార్యక్రమానికి ఇద్దరం కలిసి ఒకే విమానంలో వెళ్లి, కర్ణాటక తెలుగు మహాసభ కార్యక్రమంలో పాల్గొన్నామని అన్నారు. గల్ఫ్ గాయాలు సినిమా పోస్టర్, సీ డీని అశోక్ తేజ ఆవిష్కరించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం చాంద్ పాషా మాట్లాడుతూ..అశోక తేజ తన పాటలతో సమాజాన్ని చైతన్య పరిచారు. ఒకటే జననం.. ఒకటే మరణం అంటూ.. జీవితంలో పోరాటం చేయాలని ప్రజలను మేల్కొలిపారు. నేను సైతం అంటూ టాగూర్ సినిమా పాట ద్వారా అవినీతిని తుడిచివేయాలనీ చైతన్య పరిచారు. తన పాటల ద్వారా పల్లె ప్రజలను కష్టాలను మనసుకు హత్తుకునేలా రాయడం తోపాటు, యువత స్వ శక్తిని నమ్ముకోవాలనీ ఉద్బోధించారు. సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించాలని, ప్రశ్నించే తత్వాన్ని తన పాటల ద్వారా నేర్పారు. సుద్దాల అశోక్ తేజ తెలంగాణ గడ్డ పై పుట్టిన చైతన్య గీతిక అని కొనియాడారు. అశోక్ తేజ స్ఫూర్తి తో యువత సమాజ హితం కోసం పాటు పడాలని షేక్ చాంద్ పాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాచకొండ శ్రీరాములు, జానపద గీత రచయిత మల్లిక్ తేజ, దయాల శంకర్, వోడ్నాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# కళలకు నిలయం కోరుట్ల

### సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ

### ముగిసిన భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవాలు



కోరుట్ల మార్చ్ 18 (ప్రజామంటలు): కోరుట్ల ప్రాంతం కవులకు, కళాకారులకు నిలయమని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్'తేజ అన్నారు. భారతీ సాహిత్య సమితి స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలోని సినారే కళా భవనంలో 3 రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సభలో ప్రధాన వక్తగా పాల్గొన్న అశోక్'తేజ మాట్లాడుతూ.... కోరుట్ల, మెట్టుపల్లి ప్రాంతాల్లో డాక్టర్ అందె వెంకటరాజం, శ్రీగాదె శంకరకవి, మురళీమోహనాచార్య వంటి కవి పండితులతో పాటూ ఎందరో కళాకారులు తమదైన శైలిలో ప్రతిభను కనబరిచారన్నారు. సామాజిక చైతన్యంలో సాహిత్యం పాత్ర చాలా కీలకమైందని అశోక్ తేజ అభివర్ణించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించే సంస్కృతి పిల్లలకు చిన్ననాటి నుండే అలవాటు చేయాలని, తాను ఎంత ఎత్తుకు ఎదిగిన సాహిత్యంలో తనకు కోరుట్ల ప్రాంతం తల్లి లాంటిదని, తనకు మార్గదర్శనం చేసిన ఈ గురువులను ఎన్నటికీ మరిచిపోలేనని అశోక్'తేజ పేర్కొన్నారు. తన 30 సంవత్సరాల సినీ జీవితంలో 19 వందల సినిమాలకు 4 వేలకు పైగా పాటలు రాశానని వివరించారు. తాను సాధించిన విజయంలో ఈ ప్రాంతంలోని తన గురువుల, మిత్రుల పాత్ర తప్పక ఉందని అశోక్'తేజ తన పాత జ్ఞాపకాలను సభాముఖంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.... సమాజంలో కవులు, కళాకారుల సాహిత్యం మంచి ప్రభావం చూపుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సాహిత్యం పాత్ర గొప్పదన్నారు. ఇటీవల కాలంలో యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను కోల్పోతున్న విషయంగా అశోక్'తేజ ఒక సందేశాత్మక పాట రాయాలని కోరారు. కోరుట్ల ప్రాంతంలో భారతీ సాహిత్య సమితి చేస్తున్న సాహిత్య సేవలు అభినందనీయమని నర్సింగరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు కంజర్ల రామాచార్య, బట్టు హరికృష్ణలు మాట్లాడుతూ.... భారతీ సాహిత్య సమితి పుట్టి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా జరిగిన 3 రోజుల ఉత్సవాల్లో మొదటి రోజు 'కవిగాయక సమ్మేళనం' రెండవ రోజు 'అష్టావధానం' మూడో రోజు సినీ గేయ రచయిత అశోక్ తేజకు 'స్వర్గీయ వరదాచార్యుల స్మారక పురస్కార ప్రధానం' కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కోరుట్ల ప్రాంతంలో మరింతగా సాహిత్య సేవలు అందించడానికి సమితి ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా సాహిత్య సమితి వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ అందె వెంకటరాజం రచించిన 'నింబగిరి నరసింహ శతకం' అనే పుస్తకాన్ని అశోక్ తేజ, నర్సింగరావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఆడెపు కమల మధు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల అధ్యక్షులు కొంతం రాజం, నిర్వాహకులు అందె రాజేంద్ర, రాజోజు భూమేశ్వర్, బ్రహ్మన్నగారి శంకరశర్మ, అందే శివప్రసాద్, ఆడెపు శేఖర్, కల్వకోట చంద్రప్రకాష్, రాస భూమయ్య, తత్వాది మాధవి రాజేంద్రప్రసాద్, గోనె శ్రీహరి, వనపర్తి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్మకానికి పెట్టారు

**ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏవి?**

**నిరుపేదల అకౌంట్లలో 15 లక్షలు ఏవి?**

**ధరల పెరుగుదలకు మోడీ పాలన కారణం కాదా?**

**తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలే దేశంలో పునరావృతం అవుతాయి**

**తెలంగాణ లో బిజెపి అకౌంట్ కూడా ఓపెన్ కాదు**

**కాళేశ్వరం అవినీతికి ఆస్కారం ఇచ్చింది మోడీయే**

జగిత్యాల మార్చ్ 18 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

జగిత్యాలలో మోడీ ప్రసంగం దేశ భవిషత్ ప్రణాళిక వివరించాల్సి ఉండగా, నిస్తేజంగా ఉంది. నిర్మాణాత్మకంగా ఉంటదని భావిస్తే స్పష్టత లోపించింది. ప్రధాని బాధ్యత రాహిత్యం మాట్లాడారని విమర్శించారు. దశాబ్ద కాలంగా మోడీ పాలన సాగించారు. ప్రధాన ఉత్పత్తి రంగం వ్యవసాయరంగం పై మోడీ వ్యాఖ్యలు విస్తుగొలిపాయి. రైతుల అభివృద్ధి మాట దేవుడెరుగు. వ్యవసాయానికి పెట్టుబడి రెండితలు పెరిగింది. రాజకీయాలకు అతీతంగా దేశ రాజధాని సరిహద్దుల్లో రైతులు మద్దతు ధరకు చట్టబద్దత కల్పించాలని ఉద్యమం సాగుతుంటే స్పందించడం లేదు. కనీస మద్దతు ధర కు చట్ట బద్దత లేకపోతే, అర్థమే వుండదు. వ్యవసాయానికి పెద్ద పీట వేసేందుకు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ భారీ ప్రాజెక్టులు నిర్మించారు. భారత ఆహార సంస్థ పంటలకు మద్దతు ధర కల్పించడం తో పాటు, వినియోగ దారులకు ఆహార భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేశామన్నారు. మద్దతు ధరకు చట్ట బద్దత కల్పించకపోవడంతో పప్పు దినుసుల సాగుకు రైతులు మొగ్గు చూపడం లేదు. మూడు నల్ల చట్టలను ఉపసంహరించాలని రైతులు ఉద్యమిస్తే, మోడీ వెనకడుగు వేశారు.

కిసాన్ కల్యాణ్ అంటే ఏమిటి?

గరిబోన్కి ఉన్నతి అంటే పేదరికం పెంచండమా? తగ్గించడమా? అని నిలదీశారు.

కాంగ్రెస్ పాలనలో వరి ధాన్యం మద్దతు ధర 450 నుండి 1300 లకు సుమారు 200% పెంచినం పెంచినం. మోడీ పాలనలో వరి దాన్యం మద్దతు ధర 1300 నుండి 2300 కనీసం రెట్టింపు కూడా చేయలేదు. రైతు కూలీ లకు ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ ప్రారంభించింది. ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేలా 72 వేల కోట్ల నుండి 60 వేల కోట్లకు తగ్గించడం మోడీ ఆలోచన విధానం ఎలా ఉందో ఆలోచించాలి అన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో చెప్పాలన్నారు. మోడీ ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్మకానికి పెట్టారు. నిరుద్యోగ యువతకు చూపే ఉపాధి ఇదేనా?అభివృద్ధి అంటే ఇదేనా? మోడీ రైతులను, మహిళలకు యువతను విస్మరించారు.



పసుపు బోర్డ్ ఏర్పాటు కోసం 2023 అక్టోబర్ లో జీఓ వెలువడింది..ఎక్కడ ఏర్పాటు చేస్తారు..సభ్యులను నియమించలా వద్దా చెప్పాల్సిన బాధ్యత ఉందా లేదా అని ప్రశ్నించారు. నిజామాబాద్ లో పసుపు సాగు 2019 లో 50 వేల ఎకరాల నుండి నేడు 19 వేల ఎకరాలకు తగ్గింది. పసుపు సాగుతో గిట్టుబాటు కాక రైతులు సాగు చేయడం తగ్గించుకుంటున్నారు.నిజంగా రైతులను ఆదుకోవాలంటే పసుపు క్వింటాల్ కు మద్దతు ధర రు.15000 ఇస్తామని ప్రకటించాలన్నారు. 2019 లో పసుపు బోర్డ్ ఏర్పాటు చేస్తామని రాజ్ నాథ్ సింగ్ చెప్పారు.. ఐదేళ్లు గడిచాయి. పసుపు బోర్డు ఏర్పాటు ఒక్క అడుగు ముందుకు పడలేదు. షుగర్ ఫ్యాక్టరీ గురించి మోడీ మాట్లాడటం ఆశ్చర్యం కల్గిస్తుంది. నిన్నటి వరకు అధికారంలో ఎవరు ఉన్నారు. ఖాయిల పడిన పరిశ్రమలు తెరిచే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఉంది. 2001-2002 లో షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ జరిగింది. అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం, బిజెపి మిత్ర పక్షంగా ఉన్నది నిజం కాదా? షుగర్ ఫ్యాక్టరీ ని బిజెపి ఎంపి కొనుగోలు చేశారు. మోడీ కి ఈ విషయం తెలుసా?

నిన్నటి వరకు బీఆర్ఎస్, బిజెపి ఆలాయ్ బలాయ్ తీసుకున్నయి. షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభం చేయాల్సిన బాధ్యత లేదా? మోడీ పాలన రెండు సార్లు చూసిన ప్రజలు ఇక చాలు అంటున్నారు. కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే.

చక్కర కర్మాగారం ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ.

ప్రైవేటు పరం చేసింది టీడీపీ- బిజెపి, బీఆర్ఎస్ మూసివేసింది. ప్రతి శాసన మండలి సమావేశంలో చక్కర కర్మాగారంపై నేను మాట్లాడాను. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కి కేంద్ర ప్రభుత్వ బాధ్యత కాదా. జాతీయ ప్రాజెక్టు గా గుర్తించక పోవడంతో అవినీతికి ఆస్కారం బిజెపి కల్పించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కు రుణం ఇచ్చింది పవర్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ కాదా..ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కాదా. కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడితే, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది మోడీ కాదా అని ప్రశ్నించారు. కెసిఆర్ అవినీతి కి మార్గం సుగమం చేసింది మోడీ. కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ న్యాయ విచారణ కు కమిటీ వేసింది. న్యాయ వ్యవస్థ పై మీకు విశ్వాసం ఉందా లేదా మోడీ చెప్పాలన్నారు. యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ తో 40 వేల కోట్ల భారం పడింది.

రాష్ట్ర విభజన చట్ట ప్రకారం విద్యుత్ ప్రాజెక్టులు చేపడితే యాదాద్రి చేపట్టవలసిన అవసరం ఉండేది కాదు కదా అన్నారు. తెలంగాణ పట్ల మోడీ వివక్ష చూపారు. ప్రధాని మోడీ, బిజెపి పార్టీ నాయకులువాస్తవాలను వక్రీకరిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు 23లోలిక్కర్ కేసులో ఆధారాలు లభించగా ఇన్ని రోజులు ఎందుకు ఆగినట్టు. గతంలో ఉన్న ఆధారాలతో మాత్రమే నేడు కవిత ను అరెస్ట్ చేశారు. ఇంతకాలం కవితను ఎందుకు అరెస్ట్ చేయలేదు. సుప్రీంకోర్టు అరెస్ట్ చేయవద్దు అని చెప్పలేదు..చెబితే ఇప్పుడు ఎలా అరెస్ట్ చేస్తారు. కెసిఆర్ మోడీ మైత్రి బంధం బెడిసి కొడు తుందని ఇన్నాళ్లు వేచి చూశారు. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ ప్రభుత్వం వస్తుందని కవితను అరెస్ట్ చేయకుండ పక్కన పెట్టారనీ ఆరోపించారు. ఎవరినైనా వాడుకొని వదిలేయడం మోడీ నైజం. ప్రజలు తెరచాటు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. 100 రోజుల్లో ఎన్నికల హామీలు అమలుచేసిన పార్టీ దేశంలో ఎక్కడా లేదు..ఒక్క కాంగ్రెస్ పార్టీ మినహా విదేశాల్లో మూలుగుతున్న నల్లదనం తీసుకు వచ్చి పేదవాడి ఖాతాల్లో 15 లక్షలు వేస్తామని చెప్పారు కానీ రు.15 వేయలేదు. నిత్యావసర ధరలు పెరగటానికి కేంద్ర ప్రభుత్వం కారణం కాదా అని ప్రశ్నించారు. క్రూడాయిల్ ధర తగ్గితే పెట్రోల్, డీసెల్ తగ్గాలి కదా ఎందుకు పెరిగింది. పెట్రోల్ పై పెంచింది రు.40.. తగ్గించింది రెండు రూపాయలు. సామాన్యులపై భారం మోడీ పాలన కాదా. మోడీ ఆలోచన విధానానికి అద్దం పడుతుంది. శక్తి స్వరూపిణి కు ఆరాదించేది కాంగ్రెస్ పార్టీ. మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, రు.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎక్కడైనా ఇస్తున్నారా. కెసిఆర్ గారడీ చేసినట్టే మోడీ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు దేశంలో కూడా పునరావృతం అవుతాయి. తెలంగాణలో బిజెపి అకౌంట్ కూడా ఓపెన్ కాదు అని జోస్యం చెప్పారు. ఢిల్లీకి డబ్బులు చేర వేస్తున్నమంటే మీది అంత సమర్థ ప్రభుత్వమా? జాతీయ పార్టీ కి అధినాయకత్వం ఢిల్లీ లో ఉన్నప్పుడు అక్కడికి వెళ్లడం సాధారణమే కదా. బిజెపి సమావేశాలు ఎక్కడ అవుతున్నాయి. పాకిస్థాన్ తో యుద్ధం చేసింది. మెడలు వంచింది కాంగ్రెస్ పార్టీ.రజాకార్లతో కొట్లాడినప్పుడు నీ పార్టీ ఎక్కడ ఉన్నది. మీరు ఎక్కడ ఉన్నారు.పోరాటం చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు పెన్షన్ ఇచ్చి గౌరవించింది కాంగ్రెస్ పార్టీ. బిజెపి నిజ రూపం ప్రజలు గమనించాలని అన్నారు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి..ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పొలాస నందయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెం దుర్గయ్య, టీపీసీసీ ఎన్ఆర్ఐ కన్వీనర్ డా. చాంద్ పాషా పుప్పాల అశోక్ తదిథరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ నాయకులు



ఎల్కతుర్తి మార్చ్ 18 (ప్రజామంటలు): హన్మకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ ఎల్కతుర్తి మండల ప్రధాన కార్యదర్శి గొర్రె మహేందర్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన నాగరి ప్రీతం నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతరం వారికి శు భాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించినవారు అనంతరం నూతనంగా ఎన్నికైన ఎస్సీ కార్పొరేషన్ నాగరి తో మాట్లాడుతూ ఎస్సీల్లో ఉండబడే ప్రతి ఒక్క కుటుంబాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆదుకొని వారి యొక్క ఆర్థిక అభివృద్ధి చెందడం కోసం తోడ్పడుతానని ఇచ్చిన మాట కాంగ్రెస్ తప్పదని మాట ఇచ్చిందంటే నిలబెట్టుకుంటుంది తప్ప మాట తప్పదనే విధంగా ఎస్సీ కార్పొరేషన్ కు నీ విధాలుగా కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కలిసిన వారిలో ఎస్సీ డిపార్ట్మెంట్ హన్మకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళ రామకృష్ణ, అంబాల స్వామి, చల్ల మల్లికార్జున్, ఆరూరి సాంబన్న, నందిపాక భాస్కర్, తలకోట్ల రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా నల్ల రాజిరెడ్డి



ఎల్కతుర్తి మార్చ్ 18 (ప్రజామంటలు): సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ సేవ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నల్ల రాజిరెడ్డిని నియమిస్తూ సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు నారబత్తుల అనంత చారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ర రాజేశ్వర్ రెడ్డి ఉత్తర్వులుజారీ చేశారు. బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు నారాబత్తుల అనంతచారి, రాష్ట్రప్రధాన కార్యదర్శి కర్ర రాజేశ్వర్ రెడ్డి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు మదాసి ప్రశాంత్, రవీందర్, రమేష్, లకునల్ల రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం పర్యవేక్షణ సేవా సమితి పై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు, సమాచారాన్ని స్వీకరించడంలో సమాచారాన్ని తెలపడంలో తన వంతు సహాయక సహకారాలను ప్రజలకు సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# అనాధ వృద్ధులకు అండగా కళ్యాణి విద్యార్థులు రూ. 7,000 లు విరాళం

బుగ్గారం మార్చ్ 18 (ప్రజామంటలు):
బుగ్గారం మండలం కేంద్రాల్లోని కళ్యాణి అకాడమీక్ హైట్స్ పాఠశాల విద్యార్థులు సోమవారం మంచిర్యాలకు చెందిన శ్రీ సాయి అనాధ వృద్ధాశ్రమానికి అండగా నిలిచారు. తమ వంతు సహాయంగా వృద్ధులకు రూ. 7,000 లు విరాళం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జీవన్ మాట్లాడుతూ%%. విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి, మానవసేవే మాధవసేవ అని తెలిపారు. అదే విధంగా విరాళం అందించిన విద్యార్థులను అభినందించారు.




# అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవం

జగిత్యాల రూరల్ మార్చ్ 18 (ప్రజామంటలు):
ని మోరపల్లి 2 అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్ లావణ్య మాట్లాడుతూ.... ప్రీ స్కూల్ కి సంబంధించినటువంటి ఆటల ద్వారా విద్య కు సంబంధించి పూర్తి అంశాలను ఈ స్కూల్ తల్లులకు అవగాహన కల్పించడం జరిగింది. మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, పోషకాహారము , గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి ,హ్యాండ్ వాష్ మరియు పర్సనల్ హైజిన్ అంశాల గురించి పూర్తి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జి హెచ్ ఎం ఏ వి ఎన్ రాజు ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం శ్రీనివాసమూర్తి మరియు ఉపాధ్యాయులు అంబోజి, పద్మ, గీత, షహీన్, ఆశా హేమలత, రేవతి, శిరీష, సూపర్వైజర్ లావణ్య అంగన్వాడీ టీచర్ జమున, కిషోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.





# ఫోషణ పక్షం - ఆరోగ్య లక్ష్యం
# పోషక ఆహారాలపై అవగాహన

జగిత్యాల/ సారంగాపూర్ మార్చ్ 18 (ప్రజామంటలు):
మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పోషణ పక్షోత్సవాలలో భాగంగా సోమవారం సారంగాపూర్ మండలం రేచపెల్లి సెక్టార్ లోని రంగపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా చిన్నారులకు అక్షరాభ్యాసము గర్భిణీ స్త్రీలకు సీమంతాలను నిర్వహించారు. అనంతరం సూపర్వైజర్ శైలజ మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని గర్భిణీ స్త్రీలు బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన పోషక లభిస్తాయని తద్వారా ప్రవేశపెట్టిన కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పోషక విలువలతో కూడిన ఆహారమును పిల్లలకు పిల్లలకు అందించాలని కోరారు. విటమిన్ లోపం లేకుండా పచ్చి కూరగాయలు, ఆకు కూరలతో మంచి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. ఆహారపు అలవాట్లు, పోషక ఆహారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నీలిమ, రంగపేట అంగన్వాడి టీచర్లు శ్యామల తిరుపతమ్మ, ఆశ, అంగన్వాడి ఆయాలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సాయిబాబా ఆలయానికి నూతన కమిటీ
## నూతన అధ్యక్షుడిగా బొడ్డు మహేశ్



సికింద్రాబాద్ మార్చ్ 18 (ప్రజామంటలు):
బన్సీలాల్ పేట డివిజన్ పరిధిలోని న్యూ బోయిగూడ శ్రీసాయిబాబా ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా బొడ్డు మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ముదిరాజ్ భవన్ మీటింగ్ హాల్ లో కోర్ కమిటీ సభ్యులు, అడహాక్ కమిటీ సభ్యుల సమక్షంలో ఆలయ కమిటీ ఎన్నికల ప్రక్రియ జరిగింది. అయితే సభ్యులందరి ఏకగ్రీవ తీర్మాణంతో బొడ్డు మహేశ్ నూతన అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా పలువురు మహేశ్ కు అభినందనలు తెలిపారు. ఈ. చంద్రశేఖర్, పి. మహేందర్, సతీష్, మల్లికార్జున్, లంక రాజు, వెంకటేశ్,రాజ్ కుమార్, రాజేందర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

# ఎఫ్.టీ.పీ.సీ. ఆధ్వర్యంలో సీనియర్ నటుడు మురళీ మోహన్ కు సత్కారం

సికింద్రాబాద్ మార్చ్ 18 (ప్రజామంటలు):
సీనియర్ తెలుగు నటుడిగా 50 సంవత్సరాల తన ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న డాక్టర్ మురళీ మోహన్ ను ఎఫ్.టీ.పీ.సీ ( ఫిల్మ్ ఆండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఘనంగా సత్కరించింది. ఈమేరకు బంజారాహిల్స్ ఎల్వీ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగిన తెలుగు సినిమా వేదిక, గోల్డెన్ జూబ్లీ తెలుగు ఫిల్మ్ జర్నీ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియా తెలంగాణ క్రౌన్ విన్నర్, మిసెస్ చీర్ ఫుల్ టైటిల్ విన్నర్ సుధా దేవి నాయుడు ఈసందర్భంగా సినీ నటులు డా.మురళీ మోహన్ ను శాలువాతో సత్కరించి, మెమోంటోను అందచేశారు. తెలుగు సినిమా ఇండస్ట్రీ గర్వించదగిన విధంగా తన నటనతో ప్రేక్షకులను మైమరిపించిన మురళీ మోహన్ తెలుగు సినిమా ఇండస్ట్రీ కి చేసిన సేవలు అమూల్యమైనవని పలువురు కొనియాడారు. డా. మురళీ మోహన్ నుంచి పలువురు ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్.టీ.పీ.సీ ప్రెసిడెంట్ చైతన్య జంగ, సెక్రటరీ వర్మ పాకాలపాటి, పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.




# ఆర్యవైశ్య బాధ్యులచే ఈటెల రాజేందర్ కు రామంతపూర్ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ
## రాజగోపుర ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక అందజేత

హైదరాబాద్ మార్చి 18 (ప్రజామంటలు):
ఆర్యవైశ్య సంఘం రామాంతాపూర్ వెంకటరెడ్డినగర్, హైదరాబాద్ వారి ఆద్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ రాజగోపుర ప్రతిష్టా కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ను కలిసి సాదరంగా ఆహ్వానించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేషం గుప్త, ప్రధాన కార్యదర్శి భోనగిరి శీనివాసులు గుప్త, కోశాధికారి యెనిశెట్టి కొండయ్య గుప్త మాట్లాడుతూ.... ఈటెల రాజేందర్ గెలుపుకు ఆర్యవైశ్య సంఘం పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు.







# కరాటే లో బెల్టులు సాధించిన మెట్ పల్లి కరాటే విద్యార్థులు

మెట్ పల్లి మార్చి 18 (ప్రజామంటలు):
మెట్ పల్లి లో ఆదివారం జె.కె.ఎ.ఐ. షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండల ప్రధాన శిక్షకులు పి. వంశినాయుడు అధ్వర్యంలో బెల్ట్ ప్రశంసా పత్రాల ప్రధానోత్సవ కార్యక్రమం మెట్ పల్లి కుబ్సింగ్ కుంట పార్క్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్ కుమార్, ఆల్రౌండర్ గంగాధర్, శివ చేతుల మీదుగా కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇలాంటి కరాటే విద్యలు విద్యార్థుల వ్యక్తిత్వ, శారీరిక మానసిక వికాసానికి ఎంతో ఉపయోగ పడుతుందనీ, విద్యార్థులు, యువత ఆసక్తితో ఈ విద్యను నేర్చుకోవాలని జిల్లా ప్రధాన శిక్షకులు ప్రవీణ్ కుమార్ మాస్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన శిక్షకులు మాస్టర్ ప్రవీణ్ కుమార్, మండల ప్రధాన శిక్షకులు పి. వంశినాయుడు, అల్ రౌండర్ గంగాధర్, శివ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# జమ్ము వైష్ణో ఆలయంలో నిర్వహించే మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఈటెల రాజేందర్ కు అందజేత

హైదరాబాద్ మార్చ్ 18 (ప్రజామంటలు):
మహాభాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జమ్మూ లోని వైష్ణోదేవి క్షేత్రంలో మే 17 వ తేదీ నుండి 21 వ తేదీ వరకు నిర్వహించబోవు 18వ వార్షికోత్సవ కార్యక్రమానికి మల్కాజిగిరి భారతీయ జనతా పార్టీ పార్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్ ని మరియు వారి సతీమణి జమున రాజేందర్ ని యం.బి.బి.యస్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ,దోర్భల కృష్ణమూర్తి శర్మ , ప్రధాన కార్యదర్శి ఘణపురం రామ్ ప్రసాద్ శర్మ, కన్వీనర్ బ్రహ్మ శ్రీ మహాదేవభట్ల లక్ష్మణ ప్రసాద్ శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి బ్రహ్మ శ్రీ సిరిసిల్ల రామ శర్మ , ఉపాధ్యక్షులు బ్రహ్మ శ్రీ రాజనాల వెంకటేశ్వర శర్మ , సంయుక్త కార్యదర్శి బ్రహ శ్రీ యలమంచి చంద్రశేఖర శర్మ మరియు సభ్యులు , భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా ప్రచార కమిటీ ఇంచార్జి బ్రహ్మ శ్రీ ఘణపురం శ్యామ్ సుందర్ శర్మ గార్లు వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించాలని వేదాశీర్వచనము చేసి, వార్శికోత్సవ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానించడం జరిగింది.







# జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతం
## పలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ - రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 99.84%
## సప్లమెంటరీ హాజరు శాతం 91.89%

జగిత్యాల మార్చ్ 18 (ప్రజామంటలు):
జిల్లాలో జరుగుచున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చ్ 2024 లో భాగంగా తేది:18.03.2024 న మొదటి రోజు తెలుగు పేపర్-1 (64) రెగ్యులర్ పరీక్ష కేంద్రాలలో మొత్తం 11394 విద్యార్థులకు గాను 11376 విద్యార్థులు హాజరైనారు. (18 మంది విద్యార్థులు గైర్హాజరైనారు). రెగ్యులర్ విద్యార్థుల హాజరు శాతం 99.84% సప్లమెంటరీ విద్యార్థులకు సంబంధించిన (03) పరీక్ష కేంద్రాలలో 37 విద్యార్థులకు గాను 34 మంది విద్యార్థులు హాజరైనారు. వీరి హాజరు శాతము 91.89%. సోమవారం జిల్లా కలెక్టర్ జగిత్యాల (02) పరీక్షా కేంద్రాలను, రాష్ట్ర పరిశీలకులు (05) పరీక్షా కేంద్రాలను, జిల్లా విద్యాధికారి, జగిత్యాల (06) పరీక్షా కేంద్రాలను, మరియు ఫ్లయింగ్ స్క్వాడ్ (21) పరీక్షా కేంద్రాలను సందర్శించినారు. సోమవారం పరీక్ష ప్రశాంతంగా నిర్వహించబడినది. ఉదయము 9:30 నుండి పరీక్ష ప్రారంభం కానుండగా గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న కేంద్రాలలోని గోవిందుపల్లి వద్ద గౌతమ ఆశ్రమ పాఠశాల, ఆక్స్ఫర్డ్ ప్రభుత్వ ఓల్డ్ హై స్కూల్ లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.








# భరత్ తాటి ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ కాలేజీ
## పూర్వ అద్యాపకులకు సన్మానం

సికింద్రాబాద్ మార్చ్ 18 (ప్రజామంటలు):
బాల్యమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మారావునగర్ సర్దార్ పటేల్ కాలేజీ పూర్వ అద్యాపకులను ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ పహాడి హనుమాన్ మందిరం ఫంక్షన్ హాల్ లో బాల్యమిత్ర ఫౌండేషన్ చైర్మన్,, సర్దార్ పటేల్ కాలేజీ పూర్వ విద్యార్థి తాటి భరత్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సమావేశంలో ముందుగా ఇటీవల స్వర్గస్థులైన పలువురు పూర్వ అద్యాపకులకు శ్రద్ధాంజలి ఘటించారు. 1979 నుంచి 2010 వరకు సర్దార్ పటేల్ కాలేజీలో అద్యాపకులుగా పనిచేసిన 8మంది ప్రిన్సిపాల్స్, 18 మంది ఫ్రొఫెసర్లు, 50 మంది నాన్ టీచింగ్ స్టాఫ్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాల్యమిత్ర ఫౌండేషన్ చైర్మన్ వీరందరిని శాలువాతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు చక్కటి విద్యా బోధన చేసిన అలనాటి అద్యాపకుల రుణం తీర్చుకోలేమన్నారు. ఈసందర్భంగా కామర్స్ విభాగం ప్రిన్సిపాల్ డా.సి.పాండు మాట్లాడుతూ..తాము చదువు చెప్పిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకున్నప్పుడే ఉపాద్యాయకులు సంతోషం పడుతారన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు వేగంగా జీవితాలను దెబ్బతీస్తున్నావని, విద్యార్థులను సక్రమమైన మార్గంలో నడిపించే బాధ్యత అద్యాపకులు, వారి పేరెంట్స్ తీసుకోవాలన్నారు. డాక్టర్ రాయప్పరెడ్డి, డా.టీఎస్.ఎన్ రెడ్డి, పూర్వ ప్రిన్సిపాల్ హరినారాయణ రావు, డా.ఎ.కృష్ణరావు, డా. ఏజీ ప్రసాద్, డా.ఎ.నర్మదా, డా.చంద్రయ్య లు మాట్లాడుతూ...పూర్వ అద్యాపకుల సన్మాన కార్యక్రమం నిర్వహించడం, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం బాగుందన్నారు. పూర్వ అద్యాపకులకు మర్చిపోలేని జ్ఞాపకాన్ని అందించిన తాటి భరత్ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో 1979 నుంచి 2010 వరకు సర్దార్ పటేల్ కాలేజీ లో పనిచేసిన అన్ని విభాగాలకు చెందిన 8మంది ప్రిన్సిపాల్స్, 18 మంది ప్రొఫెసర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, 50 మంది పూర్వ విద్యార్థులు అనిల్ కుమార్ వాజపేయి, వేమాన్ కుమార్, రంజిత్ కుమార్, పాండు తదితరులు పాల్గొన్నారు.




### భరత్ తాటి కి పలువురి అభినందనలు

2003%--%2005 లో సర్దార్ పటేల్ కాలేజీలో బీకామ్ చేసిన భరత్ తాటి కాలేజీలో ఏబీవీపీ ప్రెసిడెంట్ గా పనిచేశారు. క్రమశిక్షణతో కూడన ఎన్.సీ.సీ బెస్ట్ కేడెట్ హైదరాబాద్ గా నిలిచారు. ఈ సమయంలోనే ఎన్.సీ.సీ హెూదాలో ఇండియన్ ఆర్మీ అకాడమీ డెహ్రాడూన్ లో ప్రత్యేక శిక్షణ పొందారు. కాలేజీ రోజుల్లో ఆఫ్రో ఆసియన్ గేమ్స్ లో ఉత్తమ వాలంటీర్ అవార్డును అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా భరత్ తాటి మాట్లాడుతూ...ప్రాచీన నాగరికత నుంచి నేటి ఆధునిక సాంకేతిక విప్లవం వరకు గురువునే మొదట ఆరాధించడం, గౌరవించుకోవడం మన సంస్కృతీ, సంప్రదాయంలో ఒక భాగమన్నారు. ప్రపంచంలో తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానం గురువులకే దక్కుతుందన్నారు. ఒక కుటుంబాన్ని తల్లిదండ్రులు తీర్చిదిద్దితే, సమాజాన్ని, దేశాన్ని ఎంతో గొప్పగా తీర్చిదిద్దే బాధ్యతలను నెరవేర్చేంది ఒక్క గురువులు మాత్రమే అని అన్నారు. ప్రతి గురుపౌర్ణమి కి ప్రత్యేకంగా గురువుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, గురువులను సత్కరించుకోవడం తన అదృష్టమని భరత్ తాటి అన్నారు.

# జగిత్యాల గడ్డ దేశం కోసం ఎంతో మంది బలిదానాలు చేసిన గడ్డ

జగిత్యాల జిల్లా మార్చి 18(ప్రజా మంటలు ):
జగిత్యాల జిల్లా కేంద్రం లోని గీత విద్యాలయం గౌండ్లో సోమవారం జరిగిన భారతీయ జనతా పార్టీ విజయ సంకల్ప సభలో మోదీముఖ్య అతిధిగా పాల్గొని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు గా ధర్మపురి అర్వింద్ ని , కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ని,పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులుగా గోమాస శ్రీనివాస్ నీ గెల్పించి బీజేపీ నీ ఆశీర్వదించాలని ప్రజలను కోరినారు. ఈసందర్భంగా ఎంపీ అభ్యర్థులు మాట్లాడుతూ దేశాస్థానాన్ని 11 స్థానం నుండి 5 స్థానం కు తీసుకువచ్చి 4వ స్థానానికి చేర్చుతున్న నాయకులు మోడీ అన్నారు.ప్రపంచం లోనే కొట్లాది మంది లక్షలాదిగా పలుకుతున్న పేరు మోదీ అని,మల్దీవులు విషయం లో చైనా మీసాలు దువ్వింది..కానీ తర్వాత ఏమి జరిగింది తెలుసు కాదా అని అన్నారు.

**లక్షదీప్ లో మార్నిగ్ వాకింగ్**
**సాయంత్రం చేత్రి ఏసుకొని కూర్చున్నాడు....**

ఇప్పుడు లక్షదీప్ దిశా మారింది అన్నారు. జగిత్యాల లో ఎంతమంది కరసేవకులు బలిదానం అయింద్రన్న, గోపన్న జీతన్న, మధుసూదన్ అన్నలు దీవెనతో బీజేపీ నీ ముందుకీ తీసుకెల్దాం అని ఈసందర్భంగా వారు అన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిషనరెడ్డి, జాతీయ కార్యదర్శి బండి సంజయ్, ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి,రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావు ఎంపీ నిజామాబాదు అర్వింద్ ధర్మపురి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్,ఎంపీ పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్,ఎమ్మెల్యేలు రాకేష్ రెడ్డి, రామారావు పాటిల్,దన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.




# వెలమ కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలి..
## ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని కలిసిన వెలమ సంక్షేమ సంఘం సభ్యులు..

జగిత్యాల మార్చి 18 ( ప్రజా మంటలు)
తెలంగాణ రాష్ట్రంలో వెలమ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడిన అత్యంత పేద, నిరుపేదల అభివృద్ధి కొరకు రాష్ట్రం లో ప్రత్యేక "వెలమ కార్పోరేషన్" ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు జగిత్యాల జిల్లా వెలమ సంక్షేమ సంఘం సభ్యులు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు యాచమనేని వెంకటేశ్వర్రావు,ప్రదనా కార్యదర్శి వేణు గోపాల్ రావు,కోషాధికారి దామోదర్ రావు,కార్యవర్గ సభ్యులు శ్రావణ్ రావు,కోటేశ్వర రావు,గోపాడి సురేందర్ రావు,మెన్నేని సురేందర్ రావు,కిరణ్ రావు, బేజ్జంకి అజిత్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# రామ్‌చరణ్ మూవీలో బిగ్‌బి



ఆర్ఆర్ఆర్ లాంటి గ్లోబల్ సక్సెస్ తరువాత వరుసగా అన్నీ క్రేజీ ప్రాజెక్టులను ఒకే చేస్తున్నాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ప్రస్తుతం ఆయన తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్‌తో గేమ్ ఛేంజర్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పొలిటికల్ బ్యాక్డ్రాప్ లో కమర్షియల్ ఎంటర్‌టైనర్ గా వస్తున్న ఈ సినిమా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సినిమా దీపావాళి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ సినిమా తరువాత చరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు తో ఓ సినిమా చేస్తున్నాడు. రూరల్ స్పోర్ట్స్ బ్యాక్డ్రాప్ లో వస్తున్న ఈ సినిమాలో శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా లెవల్లో రానున్న ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో హైప్ నెక్ట్స్ లెవల్లో ఉంది. అందుకు తగ్గట్టుగానే స్టార్ కాస్ట్ ను తీసుకుంటున్నారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయం ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో ప్రకటించారు. తాజాగా ఈ సినిమాలో మరో పాన్ ఇండియా స్టార్ కూడా యాడ్ కాబోతున్నాడట. ఆ స్టార్ మరెవరో కాదు బిగ్ బి అమితాబ్ బచ్చన్. అవును.. ఈ సినిమాలో మరో కీ రోల్ కోసం బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ను తీసుకోనున్నారట. ఇప్పటికే ఈ పాత్ర కు సంబంధించి ఆయనతో చర్చలు కూడా ముగిశాయని, పాత్ర నచ్చడం తో అమితాబ్ కూడా వెంటనే ఒకే చెప్పేశాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ న్యూస్ ఇండస్టీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అమితాబ్ రాకతో ఖీఅ16 అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రహమాన్ సంగీతం అందించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చ్ 22 నుండి మొదలుకానుంది అని సమాచారం. మరి భారీ స్టార్ కాస్ట్ తో వస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకోనుందో చూడాలి.

# మరోమారు విక్రమ్ దర్శకత్వంలో నితిన్




యూత్ స్టార్ నితిన్‌కు ప్రస్తుతం బ్యాడ్ టైం నడుస్తోంది. ఈ మధ్య ఆయన చేసిన సినిమాలేవీ ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. అప్పుడెప్పుడో భీష్మ సినిమాతో కెరీర్ లో బ్లాక్ బస్టర్ అనుకున్న నితిన్ ఇప్పటివరకు సరైన హిట్ కొట్టలేకపోయాడు. మధ్యలో వచ్చిన మ్యాస్ట్రో కాస్త పరవాలేదనిపించినా.. ఆతరువాత వచ్చిన మాచర్ల నియిజకవర్గం, ఎక్స్?ట్రా ఆర్డినరీ సినిమాలు డిజాస్టర్ గా నిలిచాయి. దాంతో తన తరువాతి సినిమాల విషయంలో కాస్త ఆచితూచి అడుగులు వేస్తున్నాడు నితిన్. ఈ నేపథ్యంలోనే తన నెక్ట్స్ సినిమా కోసం క్రేజీ కాంబోను సెట్ చేసుకున్నాడు నితిన్. ఈమధ్యే హనుమాన్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అనుకున్న నిర్మాత నిరంజన్ రెడ్డి బ్యానర్ లో నెక్ట్స్ సినిమా చేయనున్నాడు. ఈ ప్రాజెక్టు కోసం తన ప్రియమైన దర్శకుడు విక్రమ్ కె కుమార్ ను సెలెక్ట్ చేసుకున్నాడట. గతంలో కూడా నితిన్ వరుస ఫ్లాప్స్ లో ఉన్నప్పుడు ఇష్క్ సినిమాతో మెమరబుల్ హిట్ అందించాడు దర్శకుడు విక్రమ్. ఇప్పుడు మరోసారి తన కెరీర్ ను సెట్ చేసే భాధ్యతను విక్రమ్ చేతిలో పెట్టాడు నితిన్. ఇక విక్రమ్ కె కుమార్ అంటే వినూత్న సినిమాలకు కేరాఫ్. అలా వచ్చినవే మనం, 24, రీసెంట్ గా దూత వంటి సినిమాలు. ఇపుడు మరోసారి నితిన్ సినిమా కోసం కూడా సరికొత్త కథను సిద్ధం చేశాడట విక్రమ్. దీనికి సంబంధించిన కథా చర్చలు కూడా ఇప్పటికే పూర్తయ్యాయని, ఇప్పటివరకు కనిపించని సరికొత్త పాత్రలో నితిన్ కనిపించన్నాడని టాక్. ఈ సినిమాను నిర్మాత నిరంజన్ రెడ్డి కూడా చాలా ప్రత్యేకంగా తీసుకున్నారట. కాబట్టి.. హిట్ కాంబోలో వస్తున్న ఈ సినిమాతో నితిన్ తన కెరీర్ ను సెట్ చేసుకుంటాడా అనేది చూడాలి.




# కీడాకోలాలో ఎస్పీ పాట రీ క్రియేట్ వివాదం సర్దుకుందన్న తరుణ్ భాస్కర్

తమ అనుమతి లేకుండా గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటను రీక్రియేట్ చేయడంపై ఆయన తనయుడు ఎస్పీ చరణ్.. 'కీడా కోలా' దర్శకుడు తరుణ్ భాస్కర్, మూవీ టీమ్‌పై న్యాయపరమైన చర్యలకు దిగినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఓ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న తరుణ్ భాస్కర్ ఈ వివాదానికి వివరణ ఇచ్చారు.. 'కీడాకోలా'లో ఏఐ టెక్నాలజీ ద్వారా ఎస్పీ బాలు వాయిస్ వాడటంపై ఆయన కుమారుడు చరణ్ మీకు లీగల్ నోటీసులు పంపించారని వార్తలు వచ్చాయి. నిజమేనా?' అని విలేకరి ప్రశ్నించాడు. ఇద్దరి వైపు నుంచి కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. మనకున్న గొప్ప కళాకారులను గౌరవిస్తూ ప్రేక్షకులను అలరించే విధంగా ఏదైనా వినూత్నంగా చేయాలని ప్రతి ఒక్కరూ తాపత్రయ పడుతుంటారు. అమర్యాద పరచాలనే ఉద్దేశం ఎవరికీ ఉండదు. అగ్ర నటీనటులతో వాణిజ్య చిత్రాలు చేయాలని నేనెప్పుడూ అనుకోలేదు. అలాంటి మనస్తత్వం లేదు. ఏదైనా కొత్తగా చేయాలనుకున్నాం. కృత్రిమ మేధకూ కొన్ని పరిమితులున్నాయి. ఇప్పుడున్న రోజుల్లో చాలా ఉద్యోగాలు రిస్క్‌లో పడ్డాయి. రేపు ఏం జరుగుతుందో తెలియదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వాటిని గౌరవిస్తూ కొత్తగా ఏదైనా క్రియేట్ చేయాలి. ఈ క్రమంలోనే కమ్యూనికేషన్ గ్యాప్ తలెత్తి ఉండొచ్చు. కానీ.. ఇప్పుడంతా సర్దుకుంది. సమస్యను పరిష్కరించాం అని తరుణ్ భాస్కర్ బదులిచ్చారు. చైతన్యరావు, రాగ్ మయూర్, బ్రహ్మానందం, జీవన్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా దర్శకుడు తరుణ్ భాస్కర్ 'కీడా కోలా' తెరకెక్కించారు. గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అంతటా మంచి టాక్ సొంతం చేసుకుంది. క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రంలోని ఓ సన్నివేశంలో ఏ.ఐ. సాయంతో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాత్రాన్ని రీక్రియేట్ చేశారు. దీనిపై ఎస్పీ చరణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యుల నుంచి అనుమతి తీసుకోకుండా ఇలా చేయడం నేరమని, తరుణ్ భాస్కర్, మూవీ టీమ్‌కు లీగల్ నోటీసులు పంపించినట్లు కొన్ని రోజుల క్రితం కథనాలు వెలువడ్డాయి.





# యువ గాయని హారికా నారాయణ్ వివాహం

## ప్రియుడు పృథ్వీనాథ్‌తో ఏడడుగుల బంధం

యువ గాయని హారికా నారాయణ్ వివాహం ఘనంగా జరిగింది. తన ప్రియుడు పృథ్వీనాథ్‌తో ఆమె ఏడడుగులు వేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పెళ్లి వేడుకలో సంగీత దర్శకులు కీరవాణి, మణిశర్మ, కోటితో పాటు తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు తారలు సందడి చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. నూతన వధూవరులకు నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ బంధువే హారికా నారాయణ్. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి జర్మనీ వెళ్లాలని కలలు కన్న ఆమె అనుకోనివిధంగా సింగర్ అయ్యారు. తన గానంతో యువతను ఉర్రుతలూగించారు. 'ఆచార్య'లోని 'లాహే లాహే', 'సర్కారు వారి పాట' టైటిల్ ట్రాక్ ఆమెకు ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టాయి. నిశ్చితార్థం అనంతరం పృథ్వీనాథ్‌ను పరిచయం చేస్తూ ఇటీవల ఆమె ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. 'అందమైన స్నేహం.. ప్రేమ.. ఏడేళ్ల ప్రయాణమిది. నీతో బంధాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా' అని ఆమె రాసుకొచ్చారు.

# అల్లు అర్జున్ పుట్టిన రోజు పుష్ప-2 అప్‌డేట్ వచ్చే ఛాన్స్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా వస్తున్న లేటెస్ట్ మూవీ పుష్ప2. క్రియేటీవ్ డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన కారణంగా.. పార్ట్ 2పై రోజురోజుకి హైప్ నెక్ట్స్ లెవల్ కు చేరుకుంటోంది.అందుకు తగ్గట్టుగానే మేకర్స్ కూడా ఎక్కడ రాజీపడకుండా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షెరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా గురించి వినిపిస్తున్న చిన్న న్యూస్ అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా అలాంటి న్యూస్ ఒకటి అల్లు అర్జున్ ఫ్యాన్స్ ను ఖుషీ చేస్తోంది. చాలా కాలంగా పుష్ప 2 అప్డేట్స్ కోసం అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. కానీ, ఎలాంటి అప్డేట్స్ రాకపోవడంతో చాలా డిజప్పాయింట్ అవుతున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం అల్లు అర్జున్ ఫ్యాన్స్ కోసం ఓ స్పెషల్ ట్రీట్ అరేంజ్ చేశారట పుష్ప2 మేకర్స్. అవును.. ఏప్రిల్ 8 అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా ఓ సాలిడ్ అప్డేట్ ఇవ్వాలని ప్లాన్ చేశారట. అయితే అది ఎలాంటి అప్డేట్ అనేది మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. సినిమా రిలీజ్ కు మరో నాలుగు నెలల టైం ఉంది కాబట్టి.. ఒక చిన్న టీజర్ లాంటిది రిలీజ్ చేసి సినిమాపై హైపు క్రియేట్ చేయాలని ఎ÷-లాన్ చేస్తున్నారని టాక్. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇక పుష్ప పార్ట్ 2 విషయానికి వస్తే.. ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. మరి భారీ అంచనాల మధ్య ఆగస్టు 15న విడుదల కానున్న ఈ సినిమా ఎలాంటి వండర్స్ క్రియేట్ చేయనుందో చూడాలి.





# వివాహబంధంలోకి మీతా రఘునాథ్

చిత్రపరిశ్రమలో ఈ ఏడాది పెళ్లి బాజాలు కాస్త ఎక్కువగానే వినిపిస్తున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్, నటాషా దోషి, కృతికర్భందా వంటి కథానాయికలు ఇటీవల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టగా.. తాజాగా ఆ జాబితాలోకి మరో యువ నటి చేరింది. 'గుడ్‌నైట్' తో విజయాన్ని అందుకున్న కోలీవుడ్ భామ మీతా రఘునాథ్. రొమాంటిక్ కామెడీగా రూపొందించిన ఈ చిత్రంలో ఆమె నటనకు సినీ ప్రియులు మనసు పారేసుకున్నారు. ఆమె వివాహబంధంలోకి అడుగుపెట్టారు. జీవిత భాగస్వామితో కలిసి దిగిన ఫొటోలను తాజాగా ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'నా హృదయం' అని రాసుకొచ్చారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తూ.. కొత్త జంటకు శుభాకాంక్షలు చెబుతున్నారు. తన భర్త పేరేంటి? వివాహం ఎప్పుడు జరిగింది? అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. మీతా సొంతూరు ఊటీలో కుటుంబసభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహం జరిగినట్లు సమాచారం. మరోవైపు, 'గుడ్‌నైట్' చిత్రానికి గాను ఉత్తమ నటిగా ఆమె జె.ఎఫ్.డబ్ల్యూ మూవీ అవార్డును సొంతం చేసుకున్నారు.

# గుజరాత్ టైటాన్స్‌లోకి గిల్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ మరో నాలుగు రోజుల్లో ఆరంభం కానుంది. మార్చి 22న చెపాక్‌లోని ఎంఏ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే మ్యాచ్‌తో టోర్నీకి తెరలేవనుంది. ఐపీఎల్ 2024 కోసం క్రికెటర్లు అందరూ సిద్ధమవుతున్నారు. టోర్నీకి సమయం దగ్గరపడడంతో ప్లేయర్స్ తమ తమ జట్టుతో కలుస్తున్నారు. తాజాగా టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ గుజరాత్ టైటాన్స్ క్యాంప్‌లో చేరాడు.

శుభ్‌మన్ గిల్ ఈరోజే గుజరాత్ టైటాన్స్ క్యాంప్‌లో చేరాడు. కొత్త కెప్టెన్ గిల్ కోసం ఫ్రాంచైజీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గిల్ నడుచుకుంటూ వస్తుండగా.. ఇరువైపులా టపాసులు పేల్చారు. బ్లాక్ కోట్, పాయింట్ వేసుకున్న గిల్.. హీరోలా ఎంట్రీ ఇచ్చాడు. అతడికి గుజరాత్ ఫ్రాంచైజీ ఘన స్వాగతం పలికింది. ఇందుకు సంబందించిన ఫొటోస్, వీడియోలను గుజరాత్ టైటాన్స్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. గిల్ స్టైలిష్ లుక్‌లో ఉన్నాడని ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఐపీఎల్ 2023 ఆరంభంలోనే గాయపడి టోర్నీ మొత్తానికి దూరమైన కేన్ విలియమ్సన్ సైతం గుజరాత్ టైటాన్స్ జట్టుతో కలిశాడు. ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్ల ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గుజరాత్ టైటాన్స్ జట్టు 2022లో అరంగేట్రం చేసింది. హార్దిక్ పాండ్యా సారథ్యంలో తొలి సీజన్‌లో గుజరాత్ ట్రోఫీని గెలుచుకోగా.. గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది. హార్దిక్ ఈసారి ముంబైకి మారడంతో.. గిల్ జట్టు పగ్గాలు అందుకోనున్నాడు. గిల్ ఏమేరకు రాణిస్తాడో? చూడాలి. 17వ సీజన్ తొలి మ్యాచ్‌లో గుజరాత్ మార్చి 24న ముంబైతో తలపడనుంది.

## ఆర్‌సీబీ విజయాల్లో శ్రేయాంక పాటిల్ కీలక పాత్ర

### మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ ఛాంపియన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిలిచింది



స్మృతి మంధాన నాయకత్వంలోని ఆర్‌సీబీ.. ఆదివారం రాత్రి ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ విజయంతో ఆర్‌సీబీ కప్ కరువు తీర్చింది. గత 16 ఏళ్లగా పురుషుల జట్టుకు అందని ద్రాక్షలా ఊరిస్తున్న ట్రోఫీని ఎట్టకేలకు మహిళలు సాధించారు. ఆర్‌సీబీ ట్రోఫీని ముద్దాడడంలో ఆ జట్టు యువ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ కీలక పాత్ర పోషించింది. 21 ఏళ్ల శ్రేయాంక పాటిల్ డబ్ల్యూపీఎల్ 2024 ఫైనల్లో 4 వికెట్లు తీసింది. అంతకుముందు జరిగిన సెమీ ఫైనల్లో 2 వికెట్లు పడగొట్టింది. కాలి గాయంతో బాధపడుతూనే.. నాకౌట్ మ్యాచ్‌లలో అద్భుతమైన ప్రదర్శన చేసింది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లు ఆడిన శ్రేయాంక.. 13 వికెట్లు పడగొట్టి పర్పుల్ క్యాప్‌ను కైవసం చేసుకుంది. అయితే టోర్నీ మొదటి నాలుగు మ్యాచ్‌ల్లో ఆమె విఫలమైంది. దాంతో రెండు మ్యాచ్‌లకు దూరమైంది. మళ్లీ జట్టులోకి వచ్చిన శ్రేయాంక.. రెచ్చిపోయింది. శ్రేయాంక పాటిల్ 2002లో బెంగళూరులో జన్మించింది. దేశీవాళీ క్రికెట్‌లో కర్ణాటక జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె.. అద్భుతంగా రాణించింది. దేశవాళీ ప్రదర్శనతో శ్రేయాంక భారత జట్టులోకి వచ్చింది. గతేడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేతో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పటివరకు భారత్ తరపున 2 వన్డేలు, 6 టీ20లు ఆడిన శ్రేయాంక.. 12 వికెట్లు పడగొట్టింది. ఇక డబ్ల్యూపీఎల్ 2023 వేలంలో శ్రేయాంకను రూ.10 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ డబ్ల్యూపీఎల్ 2023 వేలంలో శ్రేయాంకను రూ.10 లక్షల కనీస ధరకు ఆర్‌సీబీ కొనుగోలు చేసింది. 2024 సీజన్‌కు ముందు రిటైన్ చేసుకుంది.

# నవంబర్ చివరి వారంలో ఆస్ట్రేలియా తో టెస్ట్ సిరీస్



ఈ ఏడాది జూన్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్ మాత్రమే కాదు 2024లో టీమ్ ఇండియా కు మరో అతిపెద్ద సవాల్ కూడా ఎదురుచూస్తోంది. ఇది కాకుండా, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్న ఆస్ట్రేలియా తో టెస్ట్ సిరీస్ . వాస్తవానికి ఈ ఏడాది చివర్లో ఇరు జట్ల మధ్య ఈ టెస్టు సిరీస్ ప్రారంభం కానుండగా, నవంబర్ చివరి వారంలో భారత జట్టు ఆస్ట్రేలియా వెళ్లే అవకాశాలున్నాయి. అలాగే స్వదేశంలో వరుసగా మూడోసారి ఆస్ట్రేలియాను ఓడించాలనే ఉద్దేశ్యంతో టీమ్ ఇండియా కంగారూల గుండెల్లోకి అడుగు పెట్టనుంది. దీంతో పాటు ఈ ఐదు మ్యాచ్‌ల వేదికలను తాజాగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా మీడియా కథనాల ప్రకారం పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు మ్యాచ్ జరగనుంది. ఇరు జట్ల మధ్య రెండో డే-నైట్ టెస్టు అడిలైడ్‌లో జరగనుంది. మూడో టెస్టు బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరగనుంది. గత పర్యటనలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆస్ట్రేలియాను ఓడించి, ఈ మైదానంలో టీమిండియా చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో జరగనుంది. ఈ మ్యాచ్ డిసెంబర్ 26న జరగనుంది. ఐదవ టెస్ట్ సిడ్నీలో జరుగుతుంది. ఈ మ్యాచ్ న్యూ ఇయర్ ప్రారంభమైన తర్వాత అంటే 2025 ప్రారంభంలో జరుగుతుంది. ప్రస్తుతానికి సిరీస్‌కు వేదికలు మాత్రమే నిర్ణయించినట్లు తెలుస్తోంది. మ్యాచ్‌ల తేదీలను ఇంకా ప్రకటించలేదు.

టెస్టు సిరీస్‌కు అవకాశం ఉన్న వేదికలు..

తొలి టెస్టు %--% పెర్త్

రెండవ టెస్ట్ %--% అడిలైడ్ (డే-నైట్ టెస్ట్)

మూడో టెస్టు %--% బ్రిస్బేన్

నాల్గవ టెస్ట్ %--% మెల్బోర్న్ (బాక్సింగ్ డే)

ఐదవ టెస్ట్ - సిడ్నీ (న్యూ ఇయర్ టెస్ట్)

గత రెండు టూర్లలో భారత్ ప్రదర్శన..

గత రెండు ఆస్ట్రేలియా పర్యటనల్లో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. 2018-19లో 4 మ్యాచ్‌ల సిరీస్‌ని 2-1తో కైవసం చేసుకుంది. ఆ తర్వాత 2020-21లో కూడా 4 మ్యాచ్‌ల సిరీస్‌ని 2-1 తేడాతో కైవసం చేసుకుంది. 2014-15 నుంచి భారత్-ఆస్ట్రేలియా మధ్య 4 టెస్టు సిరీస్‌లు జరిగాయి. నాలుగు టెస్టుల సిరీస్‌లోనూ భారత్ విజయం సాధించింది. అయితే, గతేడాది జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా భారత్‌ను ఓడించింది. భారత జట్టుకు ఆస్ట్రేలియా పర్యటన చాలా కీలకం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో టీమ్ ఇండియా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఈ ఛాంపియన్‌షిప్‌లో, ఓటమి లేదా డ్రా కూడా భారీ ప్రభావాన్ని చూపుతుంది. అంతేకాకుండా, కంగారూలను వారి సొంత మైదానంలో ఓడించడం టీమ్ ఇండియాకు మనోధైర్యాన్ని అందిస్తుంది. కాబట్టి టీమ్ ఇండియాకు ఈ సిరీస్ చాలా కీలకం. ప్రస్తుతం టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉంది. ఒకవేళ టీమిండియాపై ఓడిపోతే ఫైనల్ చేరాలనే వారి కల గల్లంతయ్యే అవకాశం ఉంది. ఓవరాల్‌గా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఫైనలిస్టులను ఈ సిరీస్ నిర్ణయిస్తుందని చెప్పడంలో తప్పులేదు.



# రోహిత్ కెప్టెన్సీ తొలగింపుపై హార్దిక్ పాండ్యా కీలక వ్యాఖ్యలు

ఐపీఎల్ 2024లో ముంబై ఇండియన్స్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తనకు మెంటార్‌గా వ్యవహరిస్తాడని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా సోమవారం తెలిపాడు. ఐపీఎల్ 2024 ప్రారంభానికి ముందే రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించాలని ముంబై ఇండియన్స్ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ నిర్ణయంపై ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఫైర్ అయ్యారు. రోహిత్ స్థానంలో గత రెండు ఐపీఎల్ సీజన్లలో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పాండ్యాను ఎంచుకున్నారు. అతను %ఖ్రూా% 2024లో ముంబై ఇండియన్స్ తరపున సారథిగా ఆడతాడు. ముంబైని ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన రోహిత్ శర్మ స్థానంలో ఎంఐ కెప్టెన్‌గా నియమించడంపై పాండ్యా తొలిసారి స్పందించాడు. %ఖ్రూా% 2024కి ముందు జరిగిన విలేకరుల సమావేశంలో హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ, 'ఇది భిన్నంగా ఏమీ ఉండదు. అతను (రోహిత్) నాకు సహాయం చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటాడు. ముంబై జట్టు ఏది సాధించినా, అది అతని నాయకత్వంలో జరిగిందే. నేను అతని కంటే ఎక్కువే చేయాలి. అతని చేతులు ఎల్లప్పుడూ నా భుజాలపై ఉంటాయి' అంటూ చెప్పుకొచ్చాడు.రోహిత్‌ని కెప్టెన్సీ నుంచి తొలగించడంపై అభిమానుల ఆగ్రహం గురించి పాండ్యాను ప్రశ్నించారు. దీనికి సమాధానంగా 'మేం అభిమానులను గౌరవిస్తాం. అయితే ఆటపైనా దృష్టి పెడతాం. ఈ రెండు మాకు ముఖ్యమైనవే' అని తెలిపాడు. అలాగే 'నేను నియంత్రించగల విషయాలపై దృష్టి సారిస్తాను. అభిమానులకు ప్రతి హక్కు ఉంది. వారి అభిప్రాయాన్ని నేను గౌరవిస్తాను' అంటూ ప్రకటించాడు.ఐపీఎల్‌తో పాండ్యా మళ్లీ టాప్ లెవల్ క్రికెట్‌లోకి రానున్నాడు. అక్టోబర్‌లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో అతను చీలమండ గాయంతో మూడు నెలల పాటు మైదానానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. తన ఫిట్‌నెస్ గురించి పాండ్యా మాట్లాడుతూ 'నా శరీరానికి ఎలాంటి ఇబ్బంది లేదు. నేను అన్ని మ్యాచ్‌లు ఆడాలని ప్లాన్ చేస్తున్నాను. సాంకేతికంగా, నేను మూడు నెలల పాటు అవుట్ అయ్యాను, ఇది ఒక విచిత్రమైన గాయం. నేను బంతిని ఆపడానికి ప్రయత్నించి గాయపడ్డాను' అంటూ చెప్పుకొచ్చాడు. విలేకరుల సమావేశంలో పాండ్యాతో పాటు కూర్చున్న ప్రధాన కోచ్ మార్క్ బౌచర్‌ను కూడా రోహిత్, అతని పాత్రను ముందుకు సాగడం గురించి ప్రశ్నలు అడిగారు. దీనిపై బౌచర్ మాట్లాడుతూ.. 'రోహిత్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. రోహిత్ తన భావాన్ని చాటుకుంటాడని మేం ఎదురుచూస్తున్నాం. ఇంగ్లండ్‌పై బ్యాటింగ్ చేయడం చూశాం. అతను అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు' అంటూ చెప్పుకొచ్చాడు.

# ఐపీఎల్ 2024 టైటిల్ ఆర్‌సీబీదే..

### ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ ఆశాభావం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో 16 ఏళ్లుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పురుషుల జట్టుకు సాధ్యం కాని ఘనతను.. మహిళా జట్టు సాధించింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లోనే స్మృతి మంధాన నేతృత్వంలోని జట్టు ట్రోఫీ గెలిచింది. 'ఇస్ సాలా కప్ నమదే' అని ప్రతి ఏడాది సందడి చేసే బెంగళూరు ఫ్యాన్స్.. 'ఇస్ సాలా కప్ నమ్దూ' అంటూ సగర్వంగా తలెత్తుకునేలా మహిళా టీమ్ చేసింది. ట్రోఫీ గెలిచిన ఆర్‌సీబీ వుమెన్ టీమ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. డబ్ల్యూపీఎల్ 2024లో ఆర్‌సీబీ టైటిల్ సాధించడంతో.. ఐపీఎల్ 2024లో సైతం ఫాఫ్ డుప్లెసిస్ నేతృత్వంలోని పురుషుల జట్టు కూడా కప్ సాదిస్తుందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. తాజాగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ సైతం ఆర్‌సీబీ కప్పు కొడుతుందని జోస్యం చెప్పాడు. 'అద్భుతమైన టోర్నమెంట్. ఈ విజయంకు ఆర్‌సీబీ మహిళలు అర్హులు. ఇక పురుషులు ఆర్‌సీబీ ట్రోఫీని డబుల్ చేస్తారా?. ఈ ఏడాది ఆర్‌సీబీదే కప్' అని వాన్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. వాన్ జోస్యం నిజమైతే బాగుండని ఆర్‌సీబీ అభిమనులు కోరుకుంటున్నారు.డబ్ల్యూపీఎల్ 2024 టైటిల్ ఆర్‌సీబీ గెలవడంతో.. ఐపీఎల్ 2024లో ఆడే ఆర్‌సీబీ జట్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిళా టీం మాదిరే.. పురుషుల టీమ్ కూడా కప్ సాధించాలని ఆర్‌సీబీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరి ట్రోఫీని డబుల్ చేస్తారా? లేదా ఎప్పటిలానే ఉత్తి చేతులతో ఇంటికి వస్తారో చూడాలి. ఆర్‌సీబీ ఇప్పటివరకు మూడుసార్లు ఫైనల్ చేరి.. తుది మెట్టుపై బోల్తా పడింది. 2009, 2011, 2016లో ఫైనల్‌కు దూసుకెళ్లినా.. వరుసగా డెక్కన్ ఛార్జర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల చేతిలో ఓడిపోయింది.

## సర్ఫరాజ్ ఖాన్‌కు లక్కీ ఛాన్స్..



టీమిండియా నయా సంచలనం సర్ఫరాజ్ ఖాన్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రీఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 17వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీకి సర్ఫరాజ్ ప్రాతినిధ్యం వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. సర్ఫరాజ్‌తో గుజరాత్ మేనేజ్మెంట్ చర్చలు జరిపినట్లు, త్వరలోనే అతడు జట్టులో జాయిన్ అవ్వనున్నట్లు తెలిసింది. ఈ విషయంపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఐపీఎల్ 2024 మినీ వేలంలో రూ.3.6 కోట్లకు కొనుగోలు చేసిన భారత యువ వికెట్ కీపర్ రాబిన్ మింజ్ కొద్ది రోజుల క్రితం బైక్ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో మింజ్ 17వ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అతడి స్థానాన్ని సర్ఫరాజ్ ఖాన్‌తో భర్తీ చేయాలని గుజరాత్ టైటాన్స్ మేనెజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సర్ఫరాజ్ అదరగొట్టడంతో.. గుజరాత్ తమ జట్టులోకి తీసుకునేందుకు సిద్ధమైంది. ఇంగ్లండ్‌పై సర్ఫరాజ్ వరుస హాఫ్ సెంచరీలు చేసిన విషయం తెలిసిందే.ఐపీఎల్ 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున సర్ఫరాజ్ ఖాన్ ఆడాడు. 2024 వేలానికి ముందు ఢిల్లీ అతడిని విడుదల చేసింది. దీంతో రూ.20 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన సర్ఫరాజ్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. ఇప్పుడు అతడికి లక్కీ ఛాన్స్ వచ్చే అవకాశం ఉంది. అప్పుడు వద్దన్నవాళ్లే ఇప్పుడు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లకు సర్ఫరాజ్ ప్రాతనిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 50 మ్యాచ్‌లు ఆడి కేవలం 585 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ మాత్రమే ఉంది. ఐపీఎల్ 2024 మార్చి 22 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.




# ట్రోఫీని గెలిచింది తాను ఒక్కదాన్ని మాత్రం కాదు

'ఈ సాలా కప్ నమ్‌దే' (ఈ సారి కప్ మాదే) అంటూ ప్రతి ఐపీఎల్ సీజన్‌లోకి రావడం.. ఉత్తి చేతులతోనే ఇంటికి వెళ్లడం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పరిపాటుగా మారింది. టీమిండియాకు ఎన్నో మ్యాచ్‌లలో విజయాలను అందించిన విరాట్ కోహ్లీ.. ఆర్‌సీబీ ఫ్రాంచైజీకి మాత్రం ఒక్క ట్రోఫీ కూడా ఇవ్వలేదు. గత 16 ఏళ్లలో మూడుసార్లు ఫైనల్ వరకు వచ్చి.. రన్నరప్‌గా నిలిచింది. దాంతో టైటిల్ అందని ద్రాక్షగానే మిగిలింది. అయితే మహిళల జట్టు మాత్రం డబ్ల్యూపీఎల్ రెండో సీజన్??లోనే కప్ సాధించింది. ఆదివారం రాత్రి ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో గెలిచిన ఆర్‌సీబీ కప్ కరువు తీర్చింది. డబ్ల్యూపీఎల్ 2024 ఫైనల్ మ్యాచ్ అనంతరం ఆర్‌సీబీ కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేసింది. ఈ విజయాన్ని మాటల్లో చెప్పలేనని, మా టీమ్ ప్రదర్శన పట్ల చాలా గర్వపడుతున్నా అని చెప్పింది. ట్రోఫీని గెలిచింది తాను ఒక్కదాన్ని మాత్రం కాదని, ఇది జట్టు గెలుపు అని పేర్కొంది. ఇక అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎప్పుడూ 'ఈ సాలా కప్ నమ్‌దే' (ఈ సారి కప్ మనదే) అని అంటుంటారు, ఇప్పటి నుంచి 'ఈ సాలా కప్ నమ్‌దూ' (ఈ సారి కప్ మాది) అనండి అని చెప్పుకొచ్చారు. స్మృతి మాటలతో ఢిల్లీ స్టేడియం మొత్తం ఆర్‌సీబీ అభిమానుల కేకలతో దద్దరిల్లిపోయింది. 'కప్ సాదించామనే గుడ్ ఫీలింగ్ ఇంకా తగ్గలేదు. నాకు మాటలు రావడం లేదు. అయితే ఓ విషయం చెప్పాలి.. మా జట్టు ప్రదర్శన పట్ల గర్వపడుతున్నా. బెంగుళూరు లెగ్‌లో మేం బాగా ఆడాం. ఢిల్లీకి వచ్చి వరుసగా రెండు ఓటములు ఎదుర్కొన్నాం. దాంతో సరైన సమయంలో ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నాం. గత సంవత్సర ఓటములు మాకు చాలా విషయాలు నేర్పాయి. ఏది తప్పు, ఏది ఒప్పు అని తెలుసుకున్నాం. ఆర్‌సీబీ మేనేజ్మెంట్ మాకు మద్దతుగా ఉంది. ఇది మీ జట్టు.. మీ శైలిలో నిర్ణయాలు తీసుకోండని చెప్పింది. ఈ విజయం ఆర్‌సీబీకి ఎంతో విలువైనది. ట్రోఫీని గెలిచింది నేను ఒక్కదాన్ని కాదు, జట్టు గెలుచుకుంది. టాప్-5 విజయాల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుంది. ఎవరికైనా ప్రపంచకప్ అగ్రస్థానంలో ఉంటుంది. ఆర్‌సీబీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. మీకు ఒకటి చెప్పాలి.. ఎప్పుడూ 'ఈ సాలా కప్ నమ్‌దే' అని అంటుంటారు, ఇప్పటి నుంచి 'ఈ సాలా కప్ నమ్‌దూ' అనండి' అని స్మృతి మంధాన అన్నారు.

# చెన్నై సూపర్ కింగ్స్ కి పెరుగుతున్న సమస్యలు

### గాయపడ్డ ముస్తాఫిజుర్ రెహమాన్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 ప్రారంభం కాకముందే, లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్  కి సమస్యలు పెరుగుతున్నాయి. జట్టుకు ఈ సమస్యలు ఆటగాళ్ల గాయాల కారణంగా వస్తుండడంతో.. సీఎస్‌కే యాజమాన్యం తలపట్టుకుంటోంది. ఇప్పటికే ఇద్దరు ఆటగాళ్లు గాయపడడంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యారు. ఇక తాజాగా %జూఖ% మూడవ ఆటగాడు సోమవారం గాయపడ్డాడు. బంగ్లాదేశ్ ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్ గాయం చాలా తీవ్రంగా ఉంది. దీంతో అతన్ని స్ట్రెచర్ ఉపయోగించి మైదానం నుంచి బయటకు తీసుకొచ్చారు. చిట్టగాంగ్‌లో శ్రీలంకతో జరుగుతున్న మూడో వన్డే మ్యాచ్‌లో ముస్తాఫిజుర్ గాయపడ్డాడు. బంగ్లాదేశ్ బౌలింగ్ సమయంలో, ఇన్నింగ్స్ 42వ ఓవర్ బౌలింగ్ చేయడానికి వచ్చిన ముస్తాఫిజుర్ తీవ్రమైన తిమ్మిరితో బాధపడుతూ మైదానంలోనే కుప్పకూలిపోయాడు. దీంతో స్ట్రెచర్‌తో మైదానం నుంచి బయటకు తీసుకరావాల్సి వచ్చింది. ముస్తాఫిజుర్ వేసిన 9వ ఓవర్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. మైదానం నుంచి నిష్క్రమించిన తర్వాత, అతను 48వ ఓవర్‌లో తిరిగి వచ్చాడు. కానీ, మొదటి బంతిని బౌలింగ్ చేసిన తర్వాత అతని ఓవర్ పూర్తి చేయలేకపోయాడు. అతని స్థానంలో సౌమ్య సర్కార్ ఓవర్ పూర్తి చేశాడు. ఈ ఫాస్ట్ బౌలర్ గాయపడకముందే 39 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. తంజీమ్ హసన్ షకీబ్ స్థానంలో జట్టులోకి వచ్చిన ముస్తాఫిజుర్‌కు ఈ సిరీస్‌లో ఇదే తొలి మ్యాచ్. సోమవారం నాటి మ్యాచ్ తర్వాత చెన్నై శిబిరంలో చేరాలని భావించిన ముస్తాఫిజుర్ గాయంపై బంగ్లాదేశ్ క్రికెట్ ఇంకా ఎటువంటి అప్‌డేట్ విడుదల చేయలేదు. బౌలింగ్ చేస్తున్నప్పుడు అతను పదే పదే పొట్ట పట్టుకున్నాడు. మరి ఇలాంటి పరిస్థితుల్లో అతనికి ఎలాంటి గాయం తగిలిందో.. ఎప్పుడు పూర్తిగా ఫిట్ అవుతాడో చూడాలి.2024 సీజన్‌కు ముందు, చెన్నై సూపర్ కింగ్స్ చాలా గాయాలను ఎదుర్కొంది. డెవాన్ కాన్వే, మతిషా పతిరనా కూడా చెన్నై తరపున ఆడటం కష్టంగా మారింది. గత సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 672 పరుగులు చేసిన కాన్వాయ్.. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో బొటనవేలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ న్యూజిలాండ్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ ప్రచారం మొదటి భాగంలో ఆడలేడని భావిస్తున్నారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com